# పతాకం న్యూస్

APTEL/25/A2082

PATHAKAM NEWS TELEGU DAILY | తెలుగు దినపత్రిక

సంపుటి : 01 | సంచిక : 141 | విశాఖపట్నం | 21-2-2026 శనివారం | చీఫ్ ఎడిటర్ : ఎల్. కృష్ణరావు | పేజీలు: 8 | వెల: రూ.5/-

Volume : 01 | Issue : 141 | VISAKHAPATNAM | 21-2-2026 SATURDAY | CHIEF EDITOR: L.KRISHNA RAO | Pages:8 | Rate: Rs.5/-

Visakhapatnam, Srikakulam, Allurisitarama, Rajamahendravaram, Vijayawada, Tirupati, Anathapuram



రిపోర్టర్లు కావలెను

పతాకం న్యూస్ APTEL/25/A2082 PATHAKAM NEWS TELEGU DAILY తెలుగు దినపత్రిక

తెలుగు దిన పత్రికలో పనిచేయుటకు శ్రీకాకుళం, పాడేరు, గోదావరి జిల్లాలు తో పాటు ఆంధ్రప్రదేశ్‌లో గల రాయలసీమ, జిల్లాలో జిల్లా రిపోర్టర్స్ కావలెను.

అనుభవం ఉన్న వారికి మొదట ప్రాధాన్యత ఇవ్వబడును.

ప్రతి వార్త ఉన్నది ఉన్నట్టుగా రాసి చూపిద్దాం రండి...

ఆఫీస్ ఇన్‌చార్జ్: డి. లావణ్య

సంప్రదించవలసిన మా ఫోన్ నంబరు

9516171797, 9491286902



3లో

## వెలవెలబోతున్న మత్స్యగెడ్డ..

### ఆందోళన చెందుతున్న గిరిజనులు

## డయాబెటిస్ ఉందా..? రోజు తగినంత నీటిని తప్పకుండా తాగాలి..



6లో


4లో

## హైదరాబాద్‌లో ఏఐ వార్ రూమ్ ఏర్పాటుకు సిద్ధం: రేవంత్‌రెడ్డి

# ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్‌కు హాజరైన చంద్రబాబు

## దిగ్గజ సంస్థలతో 7 కీలక ఒప్పందాలు





**న్యూఢిల్లీ, పతాకం న్యూస్:** ఆంధ్రప్రదేశ్‌ను ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), క్వాంటం టెక్నాలజీ రంగాల్లో ప్రపంచ స్థాయి హబ్‌గా నిలిపేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఒక భారీ ముందడుగు వేసింది. భవిష్యత్ సాంకేతికతను అందిపుచ్చుకుని, యువతకు ఉజ్వల అవకాశాలు కల్పించడంతో పాటు, ప్రభుత్వ సేవలను ప్రజలకు మరింత చేరువ చేసే లక్ష్యంతో ప్రణాళికలు రచిస్తోంది. ఇందులో భాగంగా ఢిల్లీలోని భారత్ మండపం వేదికగా జరిగిన 'ఇండియా-ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్ - 2026'లో ముఖ్యమంత్రి చంద్రబాబు పాల్గొన్నారు. ఈ సదస్సులో ఐబీఎం, ఐఐటీ మద్రాస్ వంటి ప్రపంచ ప్రఖ్యాత సంస్థలతో ఏడు కీలక అవగాహన ఒప్పందాలు (ఎంవోయూలు) కుదుర్చుకున్నారు. అమరావతిలో క్వాంటం వ్యాలీని ఏర్పాటు చేసి, దానికి జాతీయ, అంతర్జాతీయ గుర్తింపు తీసుకురావడమే ఈ ఒప్పందాల ప్రధాన ఉద్దేశం. ఈ ఒప్పందాలు రాష్ట్రంలో ఏఐ, క్వాంటం రంగాల్లో నైపుణ్యాభివృద్ధి, మౌలిక వసతుల కల్పనకు మార్గం సుగమం చేయనున్నాయి. విద్యార్థులు, యువతకు అత్యాధునిక సాంకేతికతలో శిక్షణ ఇవ్వడం, ప్రభుత్వ శాఖల్లో ఏఐ వినియోగాన్ని పెంచడం, తద్వారా పాలనను సులభతరం చేయడంపై ప్రభుత్వం దృష్టి సారించింది. ఐక్యరాజ్యసమితికి చెందిన

# జగన్‌ను కలిసిన రాంబాబు



**తాడేపల్లి, పతాకం న్యూస్:** అక్రమ కేసులో అరెస్ట్ అయ్యి.. బుధవారం బెయిల్‌పై విడుదలైన అంబటి రాంబాబు నేడు తాడేపల్లిలోని వైఎస్ జగన్ నివాసానికి వెళ్లి ఆయనను కలిశారు. తనపై టీడీపీ ప్రభుత్వం పెట్టిన అక్రమ కేసులు, టీడీపీ రౌడీ మూకలు తన ఇంటిని ధ్వంసం చేసిన తీరు, హత్యాయత్నం, పోలీసుల నిర్లిప్త వైఖరి, కొంతమంది పోలీసు అధికారుల అత్యుత్సాహం వంటి అంశాలను వైఎస్ జగన్‌కు వివరించారు. తప్పుడు కేసులపై ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, చట్టపరంగా ఎదుర్కొందామని వైఎస్ జగన్ భరోసా ఇచ్చారు. అధికార పార్టీకి ఒత్తాసు పలుకుతూ వ్యవహరిస్తున్న కొంతమంది పోలీసు అధికారుల తీరును జగన్ తీవ్రంగా తప్పుబట్టారు. ప్రజల పక్షాన, ప్రజల తరుపున చేస్తున్న పోరాటంలో ఎదురయ్యే ఆటంకాలు, వేధింపులు ధీటుగా ఎదుర్కొని ప్రజలకు అండగా నిలుద్దామని, పార్టీ నాయకులు, క్యాడర్ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని తెలిపారు. ఈ భేటీలో అంబటితో పాటు ఎంపీ పిల్లి సుభాష్ చంద్రబోస్, మాజీ ఎంపీ నందిగం సురేష్, మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు, ఎన్టీఆర్ జిల్లా పార్టీ అధ్యక్షుడు దేవినేని అవినాష్ పాల్గొన్నారు. అనంతరం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు.

### వైసీపీ ఎమ్మెల్సీ మాధవరావు సవాల్‌కు

# సంధ్యారాణి కౌంటర్




**అమరావతి, పతాకం న్యూస్:** ఏపీ శాసనమండలిలో వైసీపీ సభ్యులు వేంకటేశ్వరుడి ఫోటోలు, ప్లకార్డులతో నిరసనకు దిగడం ఇప్పుడు రాష్ట్ర వ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. చెప్పులు, బూట్లతో దేవుడిని అవమానించారంటూ కూటమి సభ్యులు తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. అయితే చెప్పులు, బూట్లు వేసుకుని దేవుడి ఫోటోతో తాము సభలోకి వెళ్లినట్లు ఒక్క ఫోటో, వీడియో చూపించినా ఎమ్మెల్సీగా రాజీనామా చేస్తానంటూ వైసీపీ ఎమ్మెల్సీ మాధవరావు సవాల్ విసిరారు. ఈ ఛాలెంజ్‌పై వెంటనే స్పందించిన మంత్రి గుమ్మడి సంధ్యారాణి.. వైసీపీ సభ్యులు మండలిలో చెప్పులతో ఉన్న వీడియోను బయటపెట్టారు. ఎమ్మెల్సీగా రాజీనామా చేయాలని మాధవరావును మంత్రి డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా గుమ్మడి సంధ్యారాణి మాట్లాడుతూ.. వేంకటేశ్వరస్వామి ఫోటోలను.. ప్లకార్డుల తరహాలో వాడటం దుర్మార్గమని మండిపడ్డారు. స్వామి వారి ఫోటోను ఒకరు తలకిందులుగా పట్టుకున్నారని.. ఇంకొకరు నిరసన అవ్వగానే టేబుల్‌పై పడేశారని విమర్శించారు.

### అప్పుల్లో ఉన్న విద్యుత్ వ్యవస్థను

# గాడిలో పెట్టాం: గొట్టిపాటి



**అమరావతి, పతాకం న్యూస్:** విద్యుత్ రంగం.. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు మూల స్తంభం అని ఇంధనశాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. దేశంలో విద్యుత్ సంస్కరణలకు నాంది పలికిన వ్యక్తి.. చంద్రబాబు అని కొనియాడారు. అసెంబ్లీలో బడ్జెట్ చర్చలో ఆయన మాట్లాడారు. వైకాపా ప్రభుత్వం.. విద్యుత్ వ్యవస్థను సర్వనాశనం చేసిందని మండిపడ్డారు. గత ప్రభుత్వం ట్రూఅప్ ఛార్జీల పేరుతో ప్రజలపై రూ.30వేల కోట్ల భారం వేసిందన్నారు. "రెన్యువబుల్ ఎనర్జీ రంగంలో పెట్టుబడిదారులను గత వైకాపా ప్రభుత్వం రాష్ట్రం నుంచి తరిమికొట్టింది. అప్పుల్లో ఉన్న విద్యుత్ వ్యవస్థను మా ప్రభుత్వం గాడిలో పెడుతోంది. దేశంలో తొలిసారి 13 పైసలు ట్రూడౌన్ చేసిన ఘనత మా ప్రభుత్వానిదే. ఇంటిగ్రేటెడ్ క్లీన్ఎనర్జీ పాలసీ ద్వారా 160 గిగావాట్ల విద్యుదుత్పత్తి మా లక్ష్యం. ఆక్వా రైతులకు రూ.1.5కే యూనిట్ విద్యుత్ ఇస్తున్నాం. యూనిట్ కొనుగోలు ధరను రూ.6.35కు తగ్గించి రూ.340 కోట్లు ఆదా చేశాం. ఎస్సీ, ఎస్టీలకు పూర్తి రాయితీతో పీఎం సూర్యఘర్ అమలు చేస్తున్నాం" అని మంత్రి గొట్టిపాటి సభకు వివరించారు.


పతాకం న్యూస్ APTEL/25/A2082 PATHAKAM NEWS TELEGU DAILY తెలుగు దినపత్రిక

ధర్మం కోసం పోరాటం చేస్తున్నా.. అవినీతి, అక్రమాలను బయటకు తీస్తున్నా.. పతాకం న్యూస్‌కు సహకరించగలరు

సంవత్సరం చందా రూ. 2000

PATHAKAM NEWS
State Bank of India
A/c No: 44576280686
IFSC:SBIN00021297
DUVVADA BRANCH

పతాకం న్యూస్
APTEL/25/A2082
PATHAKAM NEWS TELEGU DAILY
తెలుగు దినపత్రిక

# సంపాదకీయం

## దారుణాలు

మాదక ద్రవ్యాల మత్తు ప్రవాహం మనిషిలోని విచక్షణను హరించి వేసి, ఎలాంటి దారుణాలకు దారి తీస్తుందో చెప్పటానికి అన్నమయ్య జిల్లా మదనపల్లెలో జరిగిన బాలిక హత్యాచార దుర్మార్గం ఒక ఉదాహరణ. అభంశుభం తెలియని పసిపాపను చిదిమేసిన కర్కశానికి కారకుడుగా కులవర్ధన్ అనే దుర్మార్గుడు బయటికి కనిపించినా- దీని వెనుక ఉన్న అసలు సిసలు కారణం రాష్ట్రంలో మాదక ద్రవ్యాల విచ్చలవిడి వినియోగం; దాని నియంత్రణకు, నిర్మూలనకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోని ప్రభుత్వ వైఫల్యమూనూ. రాష్ట్రంలో వరుసపెట్టి ఈ తరహా దారుణాలు జరుగుతున్నా- రాష్ట్ర ప్రభుత్వం తగు విధంగా కఠిన చర్యలు తీసుకోకపోవటం క్షంతవ్యం కాదు. ఇది ప్రతిపక్షాల మీద విమర్శలకో, లెక్కలతో సర్దిచెప్పుకొని, అంతా సవ్యంగా ఉందనే సమర్ధనలకో సమయం కాదు. రాష్ట్రంలో జరుగుతున్న చాలా నేరాల వెనుక మత్తు, మాదకద్రవ్యాలు ప్రేరేపకాలుగా ఉన్న గమనింపు ప్రభుత్వానికి ఉండాలి. నిందితుల ప్రాణాలు తీసేస్తోనో, వారే తీసుకుంటేనో చల్లారిపోయే తాత్కాలిక సంఘటనలుగా వీటిని చూడ కూడదు. విస్తరిస్తున్న మత్తు వృక్షాన్ని అప్పుడప్పుడు కొమ్మల్ని తెగనరికి ఉపేక్షించటం కాదు; కూకటివేళ్లతో సహా పెకలించాలి. దానికి నిరంతరమైన, నిర్దిష్టమైన కార్యాచరణ కావాలి! ఇటీవల కాలంలో రాష్ట్రంలోనూ, దేశంలోనూ గంజాయి, ఇతర మాదక ద్రవ్యాల వినియోగం విపరీతంగా పెరిగిందనే వార్తలు వస్తున్నాయి. పన్నెండేళ్ల వయసు పిల్లలు మొదలుకొని ముప్పరు ఏళ్ల లోపు యువకుల వరకూ ఎక్కువగా వినియోగిస్తున్నట్టు అధికారిక లెక్కలు చెబుతున్నాయి. అందమైన భవిష్యత్తును నిర్మించుకోవాల్సిన విద్యార్థులు మత్తుకు బానిసలై జీవితాలను వ్యర్థం చేసుకుంటున్న ఉదంతాలు కోకొల్లలుగా ఉన్నాయి. మత్తు బానిసలను ఆ ఊబి నుంచి బయటకు తెచ్చే వైద్యానికే దేశంలో ఏటా రూ.15 వేల కోట్ల ఖర్చవుతుందని ఒక అంచనా. అసలు అలాంటి చికిత్సకు వెళ్లకుండానే ఉన్మత్తులై, నిర్వీర్యులై అర్థాంతరంగా రాలిపోతున్నవారు ఎందరో! దేశంలో 2003 -- 2013 మధ్య పోలీసు తనిఖీల్లో రూ.40 వేల కోట్ల విలువైన 26 లక్షల కేజీల మాదకద్రవ్యాలు పట్టుబడితే- తరువాతి పదేళ్ల కాలంలో (2014 -- 2025) రూ.1.65 లక్షల కోట్ల విలువైన కోటి కిలోల మాదకద్రవ్యాలు దొరికాయి. విచ్చలవిడిగా పెరుగుతున్న మత్తు ద్రవ్యాల వినియోగానికి ఈ గణాంకాలు ఒక ఉదాహరణ. దొరికిన మాదకద్రవ్యాలే ఇంత పెద్దఎత్తున ఉంటే- దేశమంతా విస్తరించి వినియోగమైనది ఎంత ఉంటుందో ఊహించవొచ్చు! మాదకద్రవ్య వినియోగం తొలుత సరదాగా మొదలై, ఉత్తేజం ఇస్తున్నట్టుగా అనిపించి, తరువాత మనిషి సర్వ శారీరక వ్యవస్థలనూ నిర్వీర్యం చేస్తుంది. మత్తుకు బానిసయ్యేలా మార్చేసి, విచక్షణను, వివేచనను చంపేస్తుంది. సామాజిక కట్టుబాట్లను, నాగరిక విలువలను కాలదన్ని, మనిషిని మృగంలా మార్చేస్తుంది. ఫలితంగా తీవ్రమైన నేరాలూ, దారుణాలు చోటు చేసుకుంటున్నాయి. మాదకద్ర వ్యాల కారణంగా ఎన్నో కుటుంబాలు అస్తవ్యస్తమవుతున్నాయి. కళ్ల ముందే పిల్లలు ఉన్మత్తులవుతుంటే తీవ్ర క్షోభను అనుభవిస్తున్నాయి. ఇది భయంకరమైన మానవ సంక్షోభం. అడ్డదారుల్లో డబ్బు సంపాదించటానికి సమాజంలో చెదలా విస్తరించిన నేర సామ్రాజ్యపు పర్యవసానం! గతేడాది డిసెంబరులో నెల్లూరు నగరంలో పట్టపగలే అందరూ చూస్తుండగానే- పెంచలయ్య అనే ప్రజాకళాకారుడిని గంజాయి మూక పొట్టన పెట్టుకొంది. నిజామాబాద్ జిల్లాలో ఎక్సైజ్ శాఖ కానిస్టేబుల్ సౌమ్యను ఈ ఏడాది జనవరిలో మత్తు మాఫియా కారుతో గుద్ది, ప్రాణాలు బలిగొంది. గంజాయికి అలవాటు పడ్డ ముఠాలు హత్యలకు, అత్యాచా రాలకు పాల్పడుతున్న దారుణ ఉదంతాలు తరచూ వార్తలకెక్కుతూనే ఉన్నాయి. ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆ పార్టీకి అంటకాగుతూ ఈ ముఠాలు తమ దౌర్జన్యాలను చెలాయిస్తున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం ఈ సమస్యను తీవ్రంగా పరిగణనలోకి తీసుకోవాలి. పైపై చర్యలతో ఈ గంజాయి సామ్రాజ్యం నశించిపోదని గ్రహించాలి. అన్ని రాజకీయ పార్టీలను కలుపుకొని ఒక ఖచ్చితమైన కార్యాచరణ రూపొందించాలి. గంజాయి, ఇతర మాదకద్రవ్యాలతో సంబంధం ఉన్న ముఠాలను పార్టీల నుంచి వెలివేయాలి. రాజకీయ దన్నుతో విర్రవీగుతున్న గంజాయి సామ్రాజ్యాన్ని సామాజికంగా, రాజకీయంగా అన్ని విధాలా ఒంటరిపాటు చేసినప్పుడే -- దాని నియంత్రణ, నిర్మూలన సాధ్యమవుతుంది.

## పెమ్మసాని 18 రోజులు సినిమా చూపించాడు.. పారిపొమ్మని సీఐ చెప్పాడు: అంబటి రాంబాబు



**గుంటూరు, పతాకం న్యూస్:** మూడు కేసులకు సంబంధించి 18 రోజుల పాటు మాజీ మంత్రి, వైసీపీ నేత అంబటి రాంబాబు రాజమండ్రి సెంట్రల్ జైల్లో రిమాండ్ ఖైదీగా ఉన్న సంగతి తెలిసిందే. ఈ మూడు కేసుల్లో బెయిల్ మంజూరు కావడంతో ఆయన జైలు నుంచి బయటకు వచ్చారు. ఈరోజు ఆయన మీడియాతో మాట్లాడుతూ కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ పై మండిపడ్డారు. “24 గంటల్లో సినిమా చూపిస్తానన్నావ్... 18 రోజులు సినిమా చూపించావు. ఇందులో ఎవరు హీరో? నేనే హీరో. మీరు విలన్లు అయ్యారు” అని అన్నారు. మీడియాతో అంబటి రాంబాబు మాట్లాడుతూ “ ఇరవై రోజులుగా ఎన్నో జరిగాయి. ఏం జరిగిందో ప్రజలు అర్థం చేసుకున్నారు. జనవరి 31 అర్ధరాత్రి నల్లపాడు పోలీసులు అరెస్టు చేశారు. కోర్టు బెయిల్ ఇవ్వడంతో మొన్న విడుదల అయ్యాను. ఈ 18 రోజులు మాట్లాడే అవకాశమే రాలేదు. నా కూతురు అందరికీ అర్థమయ్యేలా అన్ని విషయాలు చెప్పింది. టీడీపీ కట్టిన ఫ్లెక్సీ వద్దకు వెళ్లి మంచి పద్ధతి కాదని చెప్పే ప్రయత్నం చేశాను. ఫ్లెక్సీని నేను చించివేయలేదు. మరుసటి రోజు గుళ్లలో పూజలు చెయ్యమని పార్టీ నుంచి సమాచారం వచ్చింది. పర్మిషన్ తీసుకుని అక్కడకు వెళ్లాను. తిరిగి వస్తుంటే కారు అడ్డుకుని అమ్మ, అక్క అంటూ బూతులు తిట్టారు. ఆ తర్వాతే నేను కూడా తిట్టాను. తర్వాత ఇంటికొచ్చి ఆలోచిస్తే నా అంతరాత్మ ఒప్పుకోలేదు. నేను అన్న మాటలు చంద్రబాబును ఉద్దేశించి కాదు. ఇంటికి వచ్చిన తర్వాత పశ్చాత్తాపానికి గురయ్యాను. ఐదు గంటలకు ఇంటివద్దకు పలు నియోజకవర్గాల నుంచి భారీగా జనం వచ్చారు. నా కుటుంబ సభ్యులు, మనవళ్లు ఇంట్లో ఉన్నారు. ఏడు గంటలపాటు టీడీపీ గూండాలు రచ్చ చేశారు. ఇంటిపై దాడి చేసిన వారంతా కమ్మవారే. పోలీసుల అండతో రెచ్చిపోయారు. ఎక్కడైనా పోలీసులు, గూండాలు ఒక్కటవుతారా? వైసీపీ వారిని మా ఇంటి వద్దకు రానివ్వకుండా పోలీసులు అడ్డుకున్నారు. పారిపోవాలని సీఐ గంగా వెంకటేశ్వర్లు నాతో చెప్పారు. పారిపోవడం కన్నా చచ్చిపోవడం మేలని నేను చెప్పాను. పోలీసులు నన్ను తీసుకెళ్లి లాకప్ లో పెట్టారు. రాత్రి 2 గంటలకు స్టేషన్ పైకి తీసుకెళ్లి నన్ను కొట్టడానికి ప్రయత్నించారు. కానీ కొట్టలేదు. నన్ను కొట్టడానికి ప్రయత్నించడంపై న్యాయపోరాటం చేస్తా. నల్లపాడు సీఐ వంశీ రిమాండ్ రిపోర్ట్ లో... “కమ్మ నా కొడకల్లారా” అని తిట్టానని రాశాడు. నా ఇద్దరు అల్లుళ్లు కమ్మవారే. కులాల పేరుతో రెచ్చగొడుతున్నది మీరే. పెమ్మసాని చంద్రశేఖర్ మూల్యం చెల్లించే రోజు వస్తుంది. తప్పక మూల్యం చెల్లించాల్సిందే. పోలీసులతో హత్యలు చేయించడం చంద్రబాబుకు అలవాటే. ఆ అలవాటు నారా లోకేశ్ కి వచ్చింది.నేను కమ్మ వ్యతిరేకిని కాదు. నన్ను నిర్మూలించాలని రెడ్ బుక్ లో రాసుకున్నారట. చంద్రబాబు కమ్మని ప్రభుత్వానికి పవన్ కల్యాణ్ కాపుకాస్తున్నాడు. వంగవీటి రంగాను కోల్పోయాం. ముద్రగడను కోల్పోవడానికి సిద్ధంగా లేము.” అని అన్నారు.

## హిందూపురంలో సొంత ఇంటి నిర్మాణానికి బాలకృష్ణ భూమి పూజ



**హిందూపురం, పతాకం న్యూస్:** ప్రముఖ సినీ నటుడు, హిందూపురం టీడీపీ ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ తన నియోజకవర్గంలో సొంత ఇంటి నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. శ్రీ సత్యసాయి జిల్లా హిందూపురంలోని వనం కాలనీలో శుక్రవారం ఆయన సతీమణి వసుంధరతో కలిసి భూమిపూజ నిర్వహించారు. ఈ కార్యక్రమంతో ఆయన హిందూపురంలోనే శాశ్వత నివాసం ఏర్పాటు చేసుకోబోతున్నట్లు స్పష్టమైంది. హిందూపురం నుంచి 2014, 2019, 2024 ఎన్నికల్లో వరుసగా మూడుసార్లు ఎమ్మెల్యేగా గెలిచిన బాలకృష్ణ, ఇప్పటివరకు హైదరాబాద్‌లో ఉంటూ నియోజకవర్గ కార్యకలాపాలు పర్యవేక్షిస్తున్నారు. దీంతో, ఆయన నియోజకవర్గానికి అందుబాటులో ఉండటం లేదంటూ ప్రతిపక్షాల నుంచి తరచూ విమర్శలు వస్తున్నాయి. ఈ విమర్శలకు చెక్ పెట్టే ఉద్దేశంతోనే బాలకృష్ణ ఈ నిర్ణయం తీసుకున్నట్లు రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి. హిందూపురం పట్టణ సమీపంలోని వనం కాలనీలో 81 సెంట్ల విస్తీర్ణంలో ఈ ఇంటిని నిర్మించనున్నారు. భూమిపూజకు సంబంధించిన ఫొటోలు, వీడియోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ఈ సందర్భంగా, ఇకపై హిందూపురమే తన కేరాఫ్ అడ్రస్ అవుతుందని బాలకృష్ణ తన సన్నిహితులతో అన్నట్లు సమాచారం. సొంత ఇంటి నిర్మాణంతో నియోజకవర్గ ప్రజలకు మరింత చేరువ కావాలని, వారితో మమేకం కావాలని ఆయన భావిస్తున్నారు.

## బావిలో చిరుత మృతదేహం



**రాయదుర్గం, పతాకం న్యూస్:**అనంతపురం జిల్లా రాయదుర్గం పట్టణ సమీపంలోని కొండపై ఏనుగుల బావిలో చిరుత మృతదేహం శుక్రవారం తెల్లవారుజామున స్థానికులకు కనిపించింది. కొండపై వాకింగ్కు వెళ్ళిన కొందరు చిరుత మృతదేహాన్ని ఏనుగుల బావిలో గుర్తించి అటవీశాఖ అధికారులకు సమాచారం అందించారు. జిల్లా అటవీ అధికారి, క్రింది స్థాయి అధికారులు చిరుత కళేబరాన్ని పోస్టుమార్టం చేసే సిబ్బంది రాయదుర్గం రానున్నారు. చిరుత ప్రమాదవశాత్తు బావిలో పడి మరణించిందా లేదా ఎవరైనా చంపి మృతదేహాన్ని బావిలో పడవేశారా అను విషయాన్ని నిర్ధారించేందుకు చిరుత కళేబరాన్ని బొందనకల్ అటవీ ప్రాంతంలో పోస్టుమార్టం చేయనున్నారు.

## గన్నవరం విమానాశ్రయంలో జగన్‌తో సినీ నటుడు బ్రహ్మానందం



**గన్నవరం, పతాకం న్యూస్:** వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి జగన్ ను ప్రముఖ సినీ నటుడు బ్రహ్మానందం కలిశారు. విజయవాడ గన్నవరం విమానాశ్రయంలో ఈ అరుదైన కలయిక చోటు చేసుకుంది. బెంగళూరుకు వెళ్లేందుకు జగన్ విమానాశ్రయానికి చేరుకున్నారు. అదే సమయంలో హైదరాబాద్ నుంచి ఒక పని మీద గన్నవరం చేరుకున్న బ్రహ్మానందం ఎయిర్ పోర్టులోనే ఉన్నారు. ఇద్దరూ ఒకరికొకరు తారసపడ్డారు. ఈ సందర్భంగా ఇద్దరూ కుశల ప్రశ్నలు వేసుకున్నారు. బ్రహ్మానందం యోగక్షేమాలు, ఆరోగ్యం గురించి జగన్ అడిగి తెలుసుకున్నారు. వీరి కలయికకు సంబంధించిన ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.

## ఏఐ సమ్మిట్‌లో కాంగ్రెస్ తీరుపై ఎంపీ పురందేశ్వరి తీవ్ర ఆగ్రహం



**న్యూఢిల్లీ, పతాకం న్యూస్:** కాంగ్రెస్ పార్టీ తీరు దేశానికి తీవ్ర అవమానకరంగా ఉందని బీజేపీ ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి తీవ్రస్థాయిలో విమర్శించారు. భారత్ అత్యంత ప్రతిష్ఠాత్మకంగా గ్లోబల్ ఏఐ సమ్మిట్‌ను నిర్వహిస్తుంటే, కాంగ్రెస్ పార్టీ మాత్రం గందరగోళం సృష్టించిందని ఆమె మండిపడ్డారు. దేశ గౌరవాన్ని పక్కనపెట్టి, అంతర్జాతీయ వేదికపై భారత్‌ను అగౌరవపరిచేలా వ్యవహరించిందని ఆరోపించారు. ఈ విషయంపై ఆమె మాట్లాడుతూ.. “భారత్ తన సాంకేతిక నాయకత్వాన్ని ప్రపంచానికి చాటిచెప్పే సమయంలో, రాహుల్ గాంధీ నేతృత్వంలోని కాంగ్రెస్ కార్యకర్తలు సమ్మిట్ వేదిక వద్ద చొక్కాలు విప్పి గందరగోళం సృష్టించారు. అంతర్జాతీయంగా మన దేశాన్ని అవమానించడానికే ఉద్దేశపూర్వకంగా ఈ చర్యకు పాల్పడ్డారు,” అని పురందేశ్వరి పేర్కొన్నారు. భారత్ ఒక టెక్నాలజీ దిగ్గజంగా ఎదిగేందుకు కృషి చేస్తున్న తరుణంలో ఇలాంటి ప్రవర్తన దేశ పతనానికి దారితీస్తుందని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. “రాజకీయ వ్యతిరేకత ఉండొచ్చు, కానీ దానికోసం దేశ ప్రతిష్ఠను ప్రపంచవ్యాప్తంగా దిగజార్చడం సరికాదు. ఇలాంటి చర్యలను భారత్ సహించదు” అని పురందేశ్వరి స్పష్టం చేశారు.

(మొదటిపేజీ తరువాయి)

## ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్‌కు హాజరైన చంద్రబాబు

ఇంటర్నేషనల్ కంప్యూటింగ్ సెంటర్ (యూఎన్ఐసీసీ)తో రాష్ట్ర ప్రభుత్వం కీలక ఒప్పందం చేసుకుంది. దీని ప్రకారం అమరావతి క్వాంటం వ్యాలీలో ఈ ఏడాది చివరి నాటికి ఒక ఏఐ క్వాంటం నైపుణ్య కేంద్రం (సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్) ఏర్పాటు కానుంది. దీనిని ఒక ఏఐ-క్వాంటం డిజిటల్ ఎంబసీగా తీర్చిదిద్దాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ ఒప్పంద కార్యక్రమంలో యూఎన్ఐసీసీ డైరెక్టర్ సమీర్ చౌహాన్ పాల్గొన్నారు.

ప్రపంచ టెక్ దిగ్గజం ఐబీఎంతో కుదుర్చుకున్న ఒప్పందం ద్వారా రాష్ట్రంలోని లక్ష మంది యువతకు క్వాంటం, ఏఐ, సైబర్ సెక్యూరిటీ రంగాల్లో శిక్షణ ఇవ్వనున్నారు. ఐబీఎం గ్లోబల్ డిజిటల్ లెర్నింగ్ ప్లాట్‌ఫాం ద్వారా పరిశ్రమ అవసరాలకు తగ్గ నైపుణ్యాలను అందించనున్నారు. ఐబీఎం ఇండియా మేనేజింగ్ డైరెక్టర్ సందీప్ పటేల్, ఇతర ప్రతినిధులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. దక్షిణ భారతదేశంలోనే మొట్టమొదటి ఏఐ, క్వాంటం డీమ్డ్ యూనివర్సిటీని ఏపీలో ఏర్పాటు చేసేందుకు నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ అండ్ ఐటీ (నీలిట్)తో ఒప్పందం కుదిరింది. ఈ యూనివర్సిటీకి కేంద్రం నిధులు సమకూర్చనుండగా, రాష్ట్ర ప్రభుత్వం భూమి కేటాయించనుంది. అమరావతిని క్వాంటం కంప్యూటింగ్‌లో జాతీయ హబ్‌గా మార్చడం దీని లక్ష్యం. నీలిట్ డైరెక్టర్ జనరల్ డాక్టర్ మదన్ మోహన్ త్రిపాఠి ఒప్పందంపై సంతకం చేశారు. రాష్ట్ర స్థాయిలో ఐదు అంచెల స్వదేశీ ఏఐ స్టాక్‌ను నిర్మించేందుకు భారత్ జెన్-నెక్స్ జెన్-ఐబీఎంలతో ప్రభుత్వం ఒప్పందం చేసుకుంది. ఇది ప్రభుత్వ సంస్థలకు సేవలు అందించడంతో పాటు, 22 భారతీయ భాషలను అనుసంధానించే వేదికగా పనిచేస్తుంది. రాష్ట్రంలోని 50 ఉన్నత విద్యాసంస్థల్లో ఏఐ, క్వాంటం టెక్నాలజీని బలోపేతం చేసేందుకు కాలిబో ఏఐ సంస్థ ముందుకు వచ్చింది. ఏఐ అకాడెమీ, ఏఐ శాండ్‌బాక్స్, ఇన్నోవేషన్ ల్యాబ్స్ ఏర్పాటు చేసి విద్యార్థులకు, ఫ్యాకల్టీకి శిక్షణ ఇవ్వనున్నారు. ఏఐ ఆధారిత కరిక్యులమ్ రూపకల్పనపై కూడా ఈ ఒప్పందంలో దృష్టి సారించారు. అమరావతి క్వాంటం వ్యాలీలో మరో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఏర్పాటుకు వైజర్ సంస్థతో ఒప్పందం కుదిరింది. ఈ ఏడాది చివరి నాటికి మూడున్నర లక్షల మందికి, 2027 నాటికి ఆరు లక్షల మందికి ఏఐ-క్వాంటం రంగాల్లో శిక్షణ ఇవ్వాలని వైజర్ సంస్థ లక్ష్యంగా పెట్టుకుంది. రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాల విద్యార్థుల కోసం ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆధారిత ట్యూటర్‌ను అందుబాటులోకి తీసుకురావడానికి ఐఐటీ మద్రాస్‌తో రాష్ట్ర ప్రభుత్వం ఒప్పందం చేసుకుంది. దీని ద్వారా విద్యార్థుల అభ్యాసన సామర్థ్యాన్ని పెంచాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఐఐటీ మద్రాస్ డైరెక్టర్ ప్రొఫెసర్ కామకోటి ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ ఒప్పందాలతో ఆంధ్రప్రదేశ్ భవిష్యత్ టెక్నాలజీకి చిరునామాగా మారనుందని విశ్లేషకులు భావిస్తున్నారు.

# వెలవెలబోతున్న మత్స్యగెడ్డ.. ఆందోళన చెందుతున్న గిరిజనులు



**ముంచంగిపుట్టు, పతాకం న్యూస్:** మండలంలోని సుజనకోట, పెదగూడ, పనసపుట్టు, జోలాపుట్టు, లక్ష్మీ పురం, బుంగాపుట్టు, రంగబయలు తదితర పంచాయతీల పరిధిలో మత్స్యగెడ్డ వెలవెలబోతున్నది. సుమారు నెలన్నర క్రితం వరకు మత్స్యగెడ్డ నిండు కుండను తలపించింది. అయితే రెండు నెలల నుంచి పరీవాహక ప్రాంతాల్లో వర్షాలు లేకపోవడం, మరోవైపు మాచ్‌ఖండ్ జలవిద్యుత్ కేంద్రానికి నిరంతరాయంగా నీటిని సరఫరా చేస్తుండడంతో మత్స్యగెడ్డలో నీటి నిల్వలు వేగంగా తగ్గిపోతున్నాయి. ప్రస్తుతం శీతాకాలం అయినప్పటికీ మధ్యాహ్నపూట ఎండ తారెత్తిస్తున్నది. దీనివల్ల కొంతమేర నీరు ఆవిరవుతున్నది. వేసవి ప్రారంభానికి ముందే నీటి నిల్వలు తగ్గుతుండడంతో గ్రామాల్లో భూగర్భ జలాలు మరింత దిగజారి, తాగునీటి ఎద్దడి ఏర్పడుతుందని పలు గ్రామాల గిరిజనులు ఆందోళన చెందుతున్నారు. మత్స్యగెడ్డలో నీటి నిల్వలు తగ్గిపోతుండంతో జోలాపుట్టు జలాశయం స్పిల్‌వే గేట్ల ద్వారా డుడుమ జలాశయానికి (మాచ్‌ఖండ్ పవర్ ప్రాజెక్టు) నీటి విడుదల జరగని పరిస్థితి నెలకొంటున్నది. దీంతో డ్యామ్ రివర్ స్లూయిస్ ద్వారా నీటిని విడుదల చేయాల్సి వస్తుందని అధికారులు చెబుతున్నారు. ఏప్రిల్ నుంచి వేసవి వర్షాలు కురిస్తే మత్స్యగెడ్డలో కొత్త నీరు చేరుతుందని, లేకపోతే భూగర్భజలాలు మరింత దిగజారి, తాగునీటి సమస్య ఏర్పడుతుందని ఆయా గ్రామాల గిరిజనులు అంటున్నారు.

## కాశీపురం గ్రామంలో శ్రీ నూకంబిక అమ్మవారు ఆలయ ప్రతిష్టతలో పాల్గొన్న టీడీపీ నాయకులు



**దేవరాపల్లి, పతాకం న్యూస్:** అనకాపల్లి జిల్లా, దేవరాపల్లి మండలం, కాశీపురం గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీ నూకంబిక అమ్మవారి ఆలయ విగ్రహ ప్రతిష్ట మరియు అమ్మవారి యొక్క పూర్ణ కలశ గ్రామ ప్రదక్షిణ మరియు అంగరంగ వైభవంగా వేలాది మందితో అన్నసంతార్పణ కార్యక్రమంతో పాటు, పూజలు వేదమంత్రాలు భక్తిశ్రద్ధలతో ప్రజలు జన సమూహంతో కార్యక్రమం జరిగింది,గ్రామ సర్పంచ్ ఆదిరెడ్డి వరలక్ష్మి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో దేవరాపల్లి మండల మాజీ టిడిపి అధ్యక్షులు,రావికమతం మండల పరిశీలకులు చిట్టిమరెడ్డి సూర్యనారాయణ, సీనియర్ పార్టీ నాయకులు పోతల నాయుడు,కాణిపాకం వినాయక స్వామి టెంపుల్ డైరెక్టర్ కృష్ణవేణి నానాజీ, నీటి సంఘం ప్రాజెక్టు డైరెక్టర్ బండారు శ్రీరామ్ మూర్తి,కొట్టానా నూకరాజు, గ్రామ శాఖ అధ్యక్షులు ఆదిరెడ్డి అక్కుతాత, గొర్లీ దేవుళ్ళు, పార్టీ సీనియర్ నాయకుడు ఆదిరెడ్డి గోవిందరావు పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## వినియోగంలోకిరాని గురుకుల పాఠశాల నూతన భవనం



**సీలేరు, పతాకం న్యూస్:** స్థానిక బాలుర గురుకుల పాఠశాల విద్యార్థులకు హాస్టల్ కోసం రెండు కోట్ల రూపాయలు వెచ్చించి నిర్మించిన భవనం ఎనిమిది నెలలైనా వినియోగంలోకి రాలేదు. దీంతో వందలాది మంది విద్యార్థులు పాత భవనాల్లో, ఇరుకు వసతితో నిత్యం ఇబ్బందులు పడుతున్నారు. సీలేరులోని బాలుర గురుకుల పాఠశాలలో 5వ నుంచి 10వ తరగతి 405 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. తరగతుల నిర్వహణ, వసతి, భోజనం చేయడానికి గతంలో నిర్మించిన మూడు భవనాలు చాలకపోవడంతో ఇబ్బంది పడుతున్నారు. ఈ సమస్య ప్రభుత్వం దృష్టికి రావడంతో 2020వ సంవత్సరంలో మూడు అంతస్థుల భవన నిర్మాణానికి రూ.2 కోట్లు మంజూరయ్యాయి. రెండు అంతస్థులకు శ్లాబ్ పనులు పూర్తయినప్పటికీ అప్పటి వైసీపీ ప్రభుత్వం బిల్లు మంజూరు చేయకపోవడంతో కాంట్రాక్టర్ పనులు ఆపేశారు. 2024లో కూటమి అధికారంలోకి వచ్చే వరకు పనులు పునఃప్రారంభం కాలేదు. వైసీపీ హయాంలో చేసిన పనులకు కూటమి ప్రభుత్వం బిల్లులు చెల్లించింది. దీంతో కాంట్రాక్టర్ పనులు మళ్లీ మొదలుపెట్టారు. మొత్తం పనులు పూర్తిచేసి సుమారు ఎనిమిది నెలల క్రితం అధికారులకు అప్పగించేశారు. కానీ ఇంతవరకు భవనాన్ని వినియోగంలోకి తీసుకురాలేదు. దీంతో విద్యార్థులు పాత భవనాల్లోని రెండు బ్లాకుల్లో తరగతులు, ఒక బ్లాకులో హాస్టల్ నిర్వహిస్తూ ఇబ్బందులతో కాలం వెళ్లదీస్తున్నారు. ఇక గురుకుల పాఠశాలలో పనిచేసే ఉపాధ్యాయులకు ఆవరణలోనే నివాసాలు వుండాలి. కానీ ఇక్కడ నివాసాలు లేకపోవడంతో సీలేరు ప్రాజెక్టు నిర్మాణ సమయంలో నిర్మించి, ప్రస్తుతం శిథిలావస్థలో ఉన్న రేకుల షెడ్లలో నివాసం ఉంటున్నారు. పైగా పాఠశాలలో వున్న 30 మంది ఉపాధ్యాయులకు సరిపడ రేకుల షెడ్లు అందుబాటులో లేకపోవడంతో ఒక్కో షెడ్డులో ఇద్దరు, ముగ్గురు టీచర్లు సర్దుకొని నివాసం వుంటున్నారు. అధికారులు స్పందించి నూతన భవనాన్ని వినియోగంలోకి తీసుకురావాలని విద్యార్థులు, తల్లిదండ్రులు కోరుతున్నారు.

## ఎంఎస్ఎంఈ పార్కుల ఏర్పాటు పనులు వేగవంతం



**అనకాపల్లి, పతాకం న్యూస్:** జిల్లాలో సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల (ఎంఎస్ఎంఈ) పార్కుల ఏర్పాటు పనులు వేగవంతం అయ్యాయి. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో ఒక ఎంఎస్ఎంఈ పార్కును ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించుకొన్నది. అనకాపల్లి నియోజకవర్గానికి సంబంధించి కోడూరులో పార్కు ఏర్పాటు పనులు పూర్తయ్యాయి. దాదాపు 70 శాతం ప్లాట్లను ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు కేటాయించారు. నర్సీపట్నం, చోడవరం, మాడుగుల, పాయకరావుపేట నియోజకవర్గాల్లో భూ సేకరణ దశల్లో వున్నాయి. ఎలమంచిలి నియోజకవర్గం అచ్యుతాపురం, రాంబిల్లి మండలాల పరిధిలో గత టీడీపీ హయాంలోనే ఎంఎస్ఎంఈ పార్కు ఏర్పాటు చేసింది. వికసిత్ భారత్-2047 లక్ష్య సాధనలో భాగంగా ప్రతి ఇంటి నుంచి ఒక పారిశ్రామిక వేత్త తయారు కావాలన్నది ప్రభుత్వ ఉద్దేశం. ఇందుకోసం తక్కువ పెట్టుబడితో సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల (ఎంఎస్ఎంఈ) పార్కుల ఏర్పాటుకు అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పిస్తున్నది. ఎలమంచిలి నియోజకవర్గానికి సంబంధించి అచ్యుతాపురం ఎస్ఈజడ్ కోసం సేకరించిన భూముల్లో ఏపీఐఐసీ ఆధ్వర్యంలో 2018లోనే ఎంఎస్ఎంఈ పార్కు ఏర్పాటైంది. ఇక్కడ పలు సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు విజయవంతంగా నడుస్తున్నాయి. జిల్లాలోని మిగిలిన అసెంబ్లీ నియోజకవర్గాల్లో మూడు దశల్లో ఈ పార్కులను ఏర్పాటు చేస్తున్నది. అనకాపల్లి మండలం కోడూరులో 70 ఎకరాల్లో ఎంఎస్ఎంఈ పార్కును ఏర్పాటు చేయగా, ఏపీఐఐసీ ఆధ్వర్యంలో మౌలిక వసతుల కల్పన పనులు పూర్తయ్యాయి. సుమారు నాలుగు కిలోమీటర్ల పొడవున అంతర్గత రోడ్లను, వాటి పక్కనే ఓపెన్ డ్రైనేజీ కాలువలను నిర్మించారు. రహదారులకు ఇరువైపులా విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేసి, లైట్లను అమర్చారు. నీటి సదుపాయం కోసం బోర్లు వేసి, ఓవర్‌హెడ్ ట్యాంకు నిర్మించారు. సుమారు 250 ప్లాట్లు వేశారు. ఇది పాత, కొత్త జాతీయ రహదారులకు చేరువలో వుండడంతో ఇక్కడ పరిశ్రమల ఏర్పాటుకు ఔత్సాహికులు ఆసక్తి చూపుతున్నారు. అధికారులు ఇప్పటికే సుమారు 170 మందికి ప్లాట్‌లను కేటాయించారు. ఇక్కడ మహిళా ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు ప్రాధాన్యం ఇస్తున్నారు.

## పోలీస్ స్టేషన్‌లకు ఇంటర్ ప్రశ్నాపత్రాలు



**నర్సీపట్నం, పతాకం న్యూస్:** ఇంటర్మీడియట్ పరీక్షలకు జిల్లా అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ప్రశ్నాపత్రాలను పోలీస్ స్టేషన్‌లకు తరలించి భద్రపరిచారు. జిల్లా కలెక్టర్ ఆదేశాలతో ఈ ఏడాది శత శాతం ఉత్తీర్ణత లక్ష్యంగా అధికారులు కృషి చేశారు. గత ఏడాది ఉత్తీర్ణత శాతం తగ్గిపోవడంతో ఈ ఏడాది ప్రత్యేక శ్రద్ధ కనబరిచారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో విద్యార్థులను ఏ, బీ, సీ, డీ కేటగిరీలుగా విభజించి చదివిస్తున్నారు. కాగా జిల్లాలో ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రైవేటు కళాశాలల్లో మొదటి, రెండో సంవత్సరం ఇంటర్మీడియట్ విద్యార్థులు 26,301 మంది వున్నారు. ఇంటర్ పరీక్షల కోసం 54 కేంద్రాలను సిద్ధం చేశారు. అన్ని గదుల్లో సీసీ కెమెరాలు అమర్చుతున్నారు. చూసిరాతలకు అవకాశం లేకుండా జిల్లా కేంద్రంతోపాటు అమరావతి నుంచి ఇంటర్మీడియట్ బోర్డు అధికారులు మానిటరింగ్ చేస్తుంటారు. ప్లైయింగ్, సిట్టింగ్ స్క్వాడ్‌లు రెండేసి చొప్పున నియమించారు. ముఖ్య పర్యవేక్షకులు 34 మంది, కస్టోడియన్లు 18 మంది, ఇన్విజిలేటర్లు 500 మంది చొప్పున విధులు నిర్వహిస్తారు. విద్యార్థులు అరగంట ముందే పరీక్షా కేంద్రానికి చేరుకోవాలని డీఐఈవో వినోద్‌బాబు తెలిపారు. ఆయా తేదీల్లో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్ష జరుగుతుంది. ఒక్క నిమిషం ఆలస్యమైనా పరీక్షా కేంద్రంలోకి అనుమతించరని స్పష్టం చేశారు. సెల్ ఫోన్లు, బ్లూటూత్‌లు, స్మార్ట్ వాచ్‌లను వెంట తీసుకురావద్దని తెలిపారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలుతోపాటు పోలీసు బందోబస్తు ఉంటుందని అన్నారు.

## ఫార్మా వ్యర్థాలతో నల్లగా మారిన ఉప్పరిగెడ్డ నీరు



**అచ్యుతాపురం, రాంబిల్లి, పతాకం న్యూస్:** అచ్యుతాపురం, రాంబిల్లిల మండలాల పరిధిలోని ఫార్మా కంపెనీల నుంచి శుద్ధిచేయని వ్యర్థాలను నేరుగా బయటకు విడుదల చేస్తున్నారు. దీంతో సమీపంలోని ఉప్పరి గెడ్డలో నీరు నల్లగా మారిపోయింది. ఇందులోని చేపలు మృత్యువాతపడ్డాయి. ఫార్మా వ్యర్థాలను గెడ్డలోకి విడుదలచేయడంపై చుట్టుపక్కల గ్రామాల రైతులు, పూడిమడక మత్స్యకారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రాంబిల్లి మండలంలో మేజర్ శారదా నది నుంచి ఉప్పరి గెడ్డ విడిపోయి కృష్ణంపాలెం, లాలంకోడూరు, ఎరకన్నపాలెం, చాటమెట్ట, పూడిమడక ఉప్పు గల్లీల పక్కనుంచి ఉప్పుటేరులో కలుస్తుంది. ఉప్పగిగెడ్డ సమీపంలో పదుల సంఖ్యలో ఫార్మా కంపెనీలు వున్నాయి. ఉత్పత్తి సమయంలో విడుదల అయ్యే వ్యర్థజలాలను పూడి గ్రామం వద్ద నిర్మించిన ఎఫ్లూయెంట్ ట్రీట్‌మెంట్ ప్లాంట్‌లో శుద్ధిచేసి, అనంతరంప్రత్యేకంగా ఏర్పాటు చేసిన చెరువుల్లోకి నీటిని పంపాలి. ఈ చెరువుల్లో పెంచే చేపలకు హాని కలగకపోతే అప్పుడు ఆ నీటిని సముద్రంలోకి విడుదల చేయాలి. కానీ ఎఫ్లూయెంట్ ట్రీట్‌మెంట్ ప్లాంట్‌ను ఇంతవరకు వినియోగంలోకి తీసుకురాలేదు. ఇక్కడి రసాయన వ్యర్థాలను పరవాడ ఫార్మా సిటీలోని ఎఫ్లూయెంట్ ట్రీట్‌మెంట్ ప్లాంట్‌కు పంపుతున్నారు. అయితే రవాణాతోపాటు ట్రీట్‌మెంట్ చాలా ఖర్చుతో కూడుకున్న పనికావడంతో కొన్ని ఫార్మా కంపెనీలు రసాయన వ్యర్థాలను నేరుగా ఉప్పరిగెడ్డలోకి విడుదల చేస్తున్నాయి. దీంతో గెడ్డ నీరంతా నల్లగా మారిపోయింది. కాలుష్యం కారణంగా ఇందులోని చేపలు చనిపోతున్నాయి. ఈ గెడ్డ నీరు పూడిమడక వద్ద ఉప్పుటేరులో కలుస్తుండడంతో అందులోని చేపలు కూడా మృత్యువాత పడుతున్నాయి. ఉప్పరిగెడ్డలో నీరు తాగి ఆవులు, గేదెలు, మేకలు, గొర్రెలు అనారోగ్యానికి గురై చనిపోతున్నాయని పలు గ్రామాల రైతులు వాపోతున్నారు.

## దేశ సంపద పంపిణీలో సామాజిక న్యాయం జరగాలి : సిపిఐ డిమాండ్




**బొబ్బిలి, పతాకం న్యూస్:** దేశసంపద పంపిణీలో సామాజిక న్యాయం జరగాలని సిపిఐ డిమాండ్ చేసింది. అంతర్జాతీయ సామాజిక న్యాయ దినోత్సవం పురస్కరించుకుని సిపిఐ పార్టీ జాతీయ సమితి ఇచ్చిన పిలుపులో భాగంగా శుక్రవారం బొబ్బిలి కోట జంక్షన్ వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కోట అప్పన్న, మునకాల శ్రీనివాస్ మాట్లాడుతూ.. దేశంలో ప్రజలనుండి వివిధ పన్నుల రూపంలో వసూలు చేస్తున్న సంపద కొంతమంది వ్యక్తుల చేతుల్లోకి వెళుతుందని అన్నారు. ఈ దేశంలో ఉన్నటువంటి సంపద ను దేశ ప్రధాని నరేంద్ర మోడీ కార్పొరేట్ శక్తులైనటువంటి అంబానీ, ఆధానీ ల చేతుల్లో పెడుతున్నారని, తద్వారా సామాన్యులకు తీరని అన్యాయం చేస్తున్నారని మండిపడ్డారు. భారత రాజ్యాంగం కల్పించిన సామాజిక హక్కులను కాల రాస్తూ భారత రాజ్యాంగాన్ని మార్చడానికి మోడీ ప్రభుత్వం విశ్వ ప్రయత్నాలు చేస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజలకు ఉపాధి కల్పించి సంపద సృష్టించే విధంగా బడ్జెట్ కేటాయింపులు లేవని, గత ఏడాది రూ.51లక్షల కోట్లు కేటాయించినప్పటికి పూర్తి స్థాయిలో ఖర్చు చేయలేదన్నారు. రాజకీయ అవసరాలు కోసమే జిఎస్టీ స్లాబ్ రేట్లు తగ్గించారని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ పట్టణ నాయకులు పురం హరి,. బాబ్జి, టి.హరిబాబు, సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## 13 నుంచి రెవెన్యూ క్రీడలు: ఆర్డీవో కృష్ణమూర్తి



**టెక్కలి, పతాకం న్యూస్:** జిల్లా కేంద్రం శ్రీకాకుళంలో వచ్చే నెల 13 నుంచి 15వ తేదీ వరకు రెవెన్యూ క్రీడలు నిర్వహించనున్నట్టు ఆర్డీవో ఎం.కృష్ణమూర్తి తెలిపారు. స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో రెవెన్యూ అసోసియేషన్ ప్రతినిధులతో సమావేశమై క్రీడలు నిర్వహణ, కల్చరల్ ఈవెంట్స్‌పై సమీక్షించారు. జిల్లా కేంద్రంలో డిప్యూటీ కలెక్టర్ క్యాడర్ స్థాయి అధికారులతో ఈ రెవెన్యూ క్రీడలు ప్రారంభమవుతాయని వివరించారు. పెద్ద ఎత్తున ఆయా మండలాల నుంచి క్రీడాకారులు ఈ రెవెన్యూ క్రీడల్లో పాల్గొనే టట్లు చూడాలని రెవెన్యూ అసోసియేషన్ సభ్యులు కోరారు. ఈ క్రీడలు. స్నేహ భావంతో జరిగేటట్లు చూడాలని ఆర్డీవో వారికి దిశా నిర్దేశించారు. ఆర్డీవోను కలిసిన వారిలో డీవీఎస్ఎన్ రాజు, నాయక్, లింగరాజు, రామారావు, నారా యణ, లక్ష్మీనారాయణ తదితరులు ఉన్నారు.

## 23 నుంచి 27 వరకు రిలే నిరాహారదీక్షలు



**పార్వతీపురం, పతాకం న్యూస్:** ప్రస్తుతం జరుగుతున్న బడ్జెట్ సమావేశాల్లో అంగన్వాడీలకు వేతనాలు పెంచాలని, మిగిలిన మినీ సెంటర్లను మెయిన్ కేంద్రాలుగా మార్చాలని, సంక్షేమ పథకాలు అమలు చేయాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు వి.ఇందిరా, పార్వతీపురం అంగన్వాడీ ప్రాజెక్టు అధ్యక్ష కార్యదర్శులు అలివేలు, గౌరీమణి పిలుపునిచ్చారు. స్థానిక ఐసిడిఎస్ కార్యాలయం వద్ద ప్రాజెక్ట్ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఇందిర మాట్లాడుతూ పేద గర్భిణీలు, బాలింతలు, చిన్నపిల్లలకు అంగన్వాడీవర్కర్లు, హెల్పర్లు, మినీవర్కర్లు అనేక సేవలు అందిస్తున్నారని, వీరికి వేతనాల పెంపు, తదితర సమస్యలు పరిష్కరించాలని 2023 డిశంబర్లో 42 రోజుల పాటు చారిత్రాత్మక సమ్మె ముగింపు సందర్భంగా నేటి నాయకులు హామీ ఇచ్చి కూటమి ప్రభుత్వంగా ఏర్పడిన తర్వాత కూడా అంగన్వాడీల వేతనాలు పెంచలేదని విమర్శించారు. అనేకమార్లు ప్రభుత్వానికి విన్నవించినప్పటికీ అంగన్వాడీలకు వేతనాలు పెంచలేదని, 2024 మార్చిలో అంగన్వాడీలకు గ్రాట్యూటీ అమలు చేస్తామని జిఒ 8 ఇచ్చారని, అయితే నేటికీ సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాట్యూటీ చట్టం అమలుచేయడానికి నిబంధనలు రూపొందించకపోవడం అన్యాయమని ఆవేదన వ్యక్తం చేశారు. 2025 డిశంబర్ తర్వాత కొంత మంది రిటైర్మెంట్ అయ్యారని, కొంత మంది సర్వీసులో ఉండి మరణించారని వారికి ఎటువంటి బెనిఫిట్ రావడంలేదని తెలిపారు. అంగన్వాడీ వర్కర్లకు సంక్షేమ పథకాలు అమలుకావడం లేదనీ, హెల్పర్ల ప్రమోషన్లో రాజకీయ జోక్యం వల్ల అర్హులు ప్రమోషన్లు కోల్పోతున్నారని దీన్ని వెంటనే అరికట్టాలని కోరారు. ప్రీస్కూల్ పిల్లలకు సాయంత్రం ఇస్తున్న స్నాక్స్‌ను నిలిపివేయడం దారుణమన్నారు. ఈ సమస్యలపై ఈనెల 23 నుంచి 27 వరకు రిలే నిరాహారదీక్షలు, ప్రాజెక్టు, జిల్లా స్థాయిల రిలే నిరాహార దీక్షలు, మార్చి 2న విజయవాడలో మహాధర్నా జరగనుందని, కావున అంగన్వాడీ వర్కరు,?ల హెల్పర్లు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి అంగన్వాడీలకు కనీస వేతనం రూ.26000 ఇవ్వాలని, పెండింగ్లో ఉన్న 1810 మినీవర్కర్లకు క్వాలిఫికేషన్ రిలక్సేషన్ ఇచ్చి మెయిన్ సెంటర్లుగా మార్చాలని, గ్రాట్యూటీ అమలుకు గైడ్‌లైన్స్ రూపొందించి, వేతనంతో కూడిన మెడికల్ లీవ్ ఇవ్వాలని, అంగన్వాడీలకు సంక్షేమ పథకాలు అర్బన్, రూరల్ తేడా లేకుండా అందరికీ అమలు చేయాలని, హెల్పర్ల ప్రమోషన్లకు నిర్దిష్టమైన గైడెన్స్ రూపొందించి అమలుచెయ్యాలని, పెండింగ్లో ఉన్న 164 సూపర్వైజర్ పోస్టులు వెంటనే భర్తీచేయాలని, మేనెల అంతా వేసవి సెలవుల జిఒ వెంటనే ఇవ్వాలని తదితర సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు లేకుంటే ఆందోళనను మరింత ఉధృత చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సెక్టార్ నాయకులు కె.రాజేశ్వరి, జ్యోతి, గౌరి, కృష్ణవేణి, సాయి, లక్ష్మి, చిన్నమ్ములు, టి.రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు. పాచిపెంట : అంగన్వాడీ కార్యకర్తలు, హెల్పర్ల వేతనాలు పెంచాలని కోరుతూ సిఐటియు ఆధ్వర్యంలో. స్థానిక ఐసిడిఎస్ ప్రాజెక్ట్ అధికారి బి అనంతలక్ష్మి వినతి పత్రం అందజేశారు. యూనియన్ ప్రాజెక్ట్ నాయకులు కె.పార్వతీదేవి, దాలమ్మ, ఎన్.బంగారమ్మ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. అంగన్‌వాడీలకు ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరుతూ ఈనెల 23, 27 వరకు ప్రాజెక్టుల్లో, అలాగే జిల్లా కేంద్రాల్లో రిలే నిరాహార దీక్షలు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీలంతా పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు కె.ఈశ్వరరావు, ప్రాజెక్ట్ నాయకులు రమాదేవి, రవణమ్మ, శృతి తదితరులు పాల్గొన్నారు.

## ‘ఆఫ్‌షోర్ నిర్వాసితులకు అండగా ప్రభుత్వం’



**పలాస, పతాకం న్యూస్:** రేగులపా డు వద్ద ఆఫ్‌షోర్ రిజర్వాయరు ని ర్వాసితులకు న్యా యం చేయడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఏపీ టీపీసీ చైర్మన్ వజ్జ బాబూరావు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ పీరికట్ల విఠల్‌రావు అన్నారు. పలాస తహసీల్దార్ కార్యాలయంలో రేగులపాడు గ్రామానికి చెందిన ఆఫ్‌షోర్ నిర్వాసి తులైన 58మంది బాధితులకు రూ.58 లక్షల మేర చెక్కులు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎమ్మెల్యే గౌతు శిరీష, వ్యవసాయశాఖ మం త్రి అచ్చెన్నాయుడు కృషి ఫలితంగా బాధితుల బకాయిలను చెల్లించామని, ఆఫ్‌షోర్ పనులు శరవేగంగా ప్రస్తుతం జరుగుతుందన్నారు. 2027 నాటికి రిజర్వాయరులో నీరు ఉండేలా పనులు జరుగుతున్నాయన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో వెంకటేష్, తహసీల్దార్ కల్యాణచక్రవర్తి, ఈఈ శేఖర్, ఏఎంసీ చైర్మన్ వంకల కూర్మారావు, టీడీపీ మండల అధ్యక్షుడు కుత్తుమ లక్ష్మణరావు, ఏఎంసీ చైర్మన్ మల్లా శ్రీనివాసరావు, టీడీపీ నాయకులు దువ్వాడ సంతోష్, అవుగాన దశరథరావు, నిర్వాసితులు పాల్గొన్నారు.

## టెన్త్ విద్యార్థి ఆత్మహత్య

**బుచ్చెయ్యపేట, పతాకం న్యూస్:** మండలంలోని కొత్త కొండెంపూడిలో పదో తరగతి విద్యార్థి ఆత్మహత్య చేసుకొన్నాడు. వెండి పట్టీలు చోరీ చేసినట్టు అభియోగం మోపడంతో మనస్తాపం చెందిన బాలుడు ఉరివేసుకొని బలవన్మరణం చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కొత్త కొండెంపూడికి చెందిన తలారి మంగపతి, భవానీ దంపతుల రెండో కుమారుడు కృష్ణ (15) వడ్డాదిలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతూ, వచ్చే నెలలో జరిగే పబ్లిక్ పరీక్షలకు సన్నద్ధం అవుతున్నాడు. ఈ నేపథ్యంలో కొత్తకొండెంపూడికి చెందిన దొండా సాయి, మణి దంపతుల ఇంటిలో వెండి పట్టీలు పోయాయి. వీటిని కృష్ణ అపహరించాడన్న అనుమానంతో అతనిని నిలదీశారు. తాను తీయలేదని మొత్తుకున్నా వారు వినలేదు. దీంతో కృష్ణ తీవ్రంగా కలత చెందాడు. రోజూ మాదిరిగానే రాత్రి కూడా నిద్రించడానికి ఊరు చివరన ఉన్న పశు వులశాల వద్దకు వెళ్లాడు. ఉదయం తల్లిదండ్రులు పాలు తీయడానికి పశువులశాల వద్దకు వెళ్లారు. కృష్ణ అక్కడ చెట్టుకు ఉరివేసుకొని కనిపించాడు. దీంతో కన్నీరుమున్నీరు అయ్యారు. సమాచారం అందుకొన్న పోలీసులు కొత్తకొండెంపూడి వెళ్లి పరిశీలించారు. తల్లిదండ్రులతోపాటు కొంతమంది గ్రామస్థుల నుంచి వివరాలు సేకరించారు.

# మున్సిపల్ కార్మికుల సమస్యలపై 24న ఛలో విజయవాడ



**విజయనగరం, పతాకం న్యూస్:** మున్సిపల్ కార్మికులకు ,ఉద్యోగుల సమస్యలు పరిష్కారం చేయాలని, 12 వ పీఆర్సీ వేయాలని, వేతనాలు పెంచాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 24 తేదీన చలో విజయవాడ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా కార్యదర్శి ఏ.జగన్మోహనరావు పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక ఎల్ బి జి భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ముందుగా చలో విజయవాడ గోడ పత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం జరుగుతున్న అసెంబ్లీ సమావేశాల్లో కార్మికులు సమస్యలు చర్చించి పరిష్కారం చేసే విధంగా నిర్ణయం చేయాలన్నారు. మున్సిపల్ కార్మికులు సేవలు, ఇంజినీరింగ్ కార్మికులు సేవలు ఎవ్వరు ఇవ్వని సేవలు అన్నారు. కరోనా సమయంలో వీరి కాళ్లకు దండం పెట్టిన పాలకులు నేడు వారి సమస్యలు పరిష్కారం చేయడం లేదన్నారు. కార్మికులకు రెగ్యులర్ చేయాలని, కనీస వేతనాలు అమలు చేసే విధంగా అసెంబ్లీ లో చర్చించి నిర్ణయాలు చేయాలని కోరారు. 11,12 వేలతో పని చేస్తున్న కార్మికులు జీవితాలు దుర్భరంగా ఉన్నాయన్నారు. వేతనాలు వ్యత్యాసాలు ఉన్నాయి ఇది సరికాదన్నారు. అంతమంది కార్మికులను చేర్చి, అప్కాస్ వేతనాలు అందరికీ అమలు చేయాలని డిమాండ్ చేశారు. అత్యవసర సేవలు అందిస్తున్న కార్మికులు పట్ల ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరించడం సరికాదన్నారు. 12 వ పిఆర్సిని ఏర్పాటు చేసి, మున్సిపల్ కార్మికులకు ప్రభుత్వమే జీతాలు చెల్లించాలనీ, మున్సిపల్ కార్మికులకు జీఓఆర్ టి నెంబర్ 1615 ప్రకారం పిఆర్సి జీతాలు, డిఎ, ఐఆర్, ఇంజనీరింగ్ కార్మికులకు టెక్నికల్ జీతాలు చెల్లించాలనీ, పంప్ హౌస్, లీకులు, వాలాపరేటర్లు, ప్లాంటేషన్, వీలిన ప్రాంత, నైట్ శానిటేషన్ క్లాప్ డ్రైవర్లకు జీఓ నెం.36 ప్రకారం జీతాలు చెల్లించాలి. పెరిగిన వేతనాలు ఇవ్వాలని, మున్సిపల్ కార్మికులందరికి సంక్షేమపథకాలు అమలుచేయలని, రిటైర్డ్, అనారోగ్యం, చనిపోయిన వారి స్థానాలలో పిల్లలకు ఉద్యోగాలు ఇవ్వాలనీ,పర్మినెంట్ వారికి డిఎ, సరండర్ లీవుల బకాయిలు చెల్లించాలి రూ.24,500/-లు జీతం ఉన్నవారందరికీ హెల్త్ కార్డులు ఇవ్వాలనీ డిమాండ్ చేస్తూ చలో విజయవాడ కార్యక్రమాన్ని చేపట్టడం జరిగిందన్నారు.

## అల్లూరి జిల్లాను ఆదర్శంగా తీర్చిదిద్దుతాం




**పాడేరు, పతాకం న్యూస్:** అల్లూరి సీతారామరాజు జిల్లాను ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామని కలెక్టర్ ఏఎస్.దినేశ్‌కుమార్ అన్నారు. విశాఖపట్నం ఐఐఎంలో నిర్వహించిన నీతి ఆయోగ్ ప్రాజెక్టు సమావేశంలో ఆయన మాట్లాడుతూ, జిల్లాలో ప్రధానంగా వ్యవసాయం, పర్యాటక రంగాలపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని చెప్పారు. సహజ సిద్ధమైన ప్రకృతి అందాలకు నిలయమైన అల్లూరి జిల్లాలో ఎకో టూరిజం అభివృద్ధికి చర్యలు చేపడుతున్నామన్నారు. భవిష్యత్తులో అరకులోయ, లంబసింగి ప్రాంతాలను పర్యాటకంగా అంతర్జాతీయ స్థాయిలో అభివృద్ధికి చర్యలు చేపడతామని చెప్పారు. పర్యావరణానికి ఎటువంటి హాని కలగకుండా ఎకో టూరిజాన్ని ప్రోత్సహిస్తున్నామన్నారు. గిరిజనుల సంప్రదాయం, సంస్కృతి, ఆచారాలు, కళలు, వైవిధ్యమైన జీవన విధానాన్ని సైతం పర్యాటకులు తెలుసుకుంటారని కలెక్టర్ చెప్పారు. ఇదే సమయంలో పర్యాటకం అభివృద్ధి చెందడం ద్వారా స్థానిక యువతకు ఉపాధి లభించి, ఆదాయం పెరుగుతుందని అన్నారు. ఇంకా స్థానిక ఉత్పత్తులకు మార్కెటింగ్ లభిస్తుందన్నారు. ఏజెన్సీలో నెలకొన్న ప్రత్యేక వాతావరణ పరిస్థితుల వల్ల వ్యవసాయ, ఉద్యాన పంటలను విరివిగా సాగు చేయాలని నిర్ణయించామని, జిల్లా ఆర్థికాభివృద్ధికి వ్యవసాయం రంగం కూడా కీలకం కానున్నదని కలెక్టర్ వెల్లడించారు. గిరిజన రైతులకు అధిక ఆదాయాన్ని ఇచ్చే కాఫీ, మిరియాలు, పసుపు పంటల సాగును ప్రోత్సాహిస్తున్నామని, ఆధునిక పద్ధతిలో సాగు, పండించిన పంటలకు మార్కెటింగ్ సదుపాయాలను అందుబాటులోకి తీసుకువస్తున్నామన్నారు. కొత్త జిల్లా అయినప్పటికీ ప్రణాళికబద్ధమైన రూట్ మ్యాప్‌ను సిద్ధం చేసుకుని అభివృద్ధికి బాటలు వేస్తున్నామన్నారు. చింతపల్లి మండలం లంబసింగి ప్రాంతంలో కుంకుమ పువ్వు సాగుకు గిరిజన రైతులను ప్రోత్సాహిస్తున్నామని కలెక్టర్ దినేశ్‌కుమార్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ సాహిత్, డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ వి.మురళి, జిల్లా పంచాయతీ అధికారి చంద్రశేఖర్, జిల్లా వ్యవసాయాధికారి ఎస్‌బీఎస్.నందు, జిల్లా విద్యా శాఖాధికారి కె.రామకృష్ణారావు, ఎల్‌డీఎం మాతునాయుడు, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

## హైదరాబాద్‌లో ఏఐ వార్ రూమ్ ఏర్పాటుకు సిద్ధం: రేవంత్‌రెడ్డి



**న్యూఢిల్లీ, పతాకం న్యూస్:** ప్రస్తుతం యావత్ ప్రపంచాన్ని ప్రభావితం చేస్తున్న ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) రంగంలో భారత్ ముందంజలో నిలవాలంటే కేంద్ర ప్రభుత్వంలో ప్రత్యేక ఏఐ మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయాలని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సూచించారు. ఏఐ వినియోగం, నియంత్రణ, చట్టపరమైన మార్గదర్శకాలు, జాతీయ భద్రత వంటి అంశాలను సమగ్రంగా నిర్వహించేందుకు ప్రత్యేక వ్యవస్థ అవసరమని సీఎం స్పష్టం చేశారు. ఢిల్లీలో నిర్వహించిన ఏఐ సమ్మిట్‌లో సీఎం రేవంత్‌రెడ్డి శుక్రవారం పాల్గొని ప్రసంగించారు. మానవ చరిత్రలో అగ్ని, చక్రం, వ్యవసాయం, విద్యుత్, ఇంటర్నెట్ వంటి ఆవిష్కరణలు ప్రపంచాన్ని ఎలా మార్చాయో ప్రస్తావించారు. ఏఐ కూడా అలాంటి విప్లవాత్మక సాంకేతికతేనని, ఇది కేవలం ఇంకొక టెక్నాలజీ కాదని, మానవ పరిణామ క్రమంలో అత్యంత శక్తివంతమైన మలుపని అభివర్ణించారు. మునుపటి యంత్రాల మాదిరిగా కాకుండా ఏఐ స్వయంగా నేర్చుకోగలదని, విశ్లేషించగలదని, నిర్ణయాలు తీసుకోగలదని పేర్కొన్నారు. రోబోటిక్స్‌తో కలిసినప్పుడు యంత్రాలు మానసిక మేధస్సుతో పాటు శారీరక సామర్థ్యాన్ని కూడా పొందుతున్నాయని వివరించారు. ప్రపంచ ఏఐ పోటీ ఇప్పటికే ప్రారంభమైందని.. కొన్ని దేశాలు, కంపెనీలు ముందంజలో ఉన్నాయని సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. గత పారిశ్రామిక విప్లవాల సమయంలో జరిగిన అవకాశ నష్టాలను గుర్తు చేస్తూ, ఈసారి భారత్ అలాంటి తప్పిదం చేయకూడదని హెచ్చరించారు. సేవలు, సాఫ్ట్‌వేర్ రంగాల్లో విజయం సాధించిన భారత్, ప్రపంచ స్థాయి కోర్ టెక్నాలజీ ఉత్పత్తుల్లో కూడా నాయకత్వం వహించాలని పిలుపునిచ్చారు. ప్రపంచవ్యాప్తంగా ఏఐ పరిణామాలను నిశితంగా పర్యవేక్షించేందుకు కేంద్ర, రాష్ట్రాల సమన్వయంతో జాతీయ ఏఐ వార్ రూమ్ ఏర్పాటు చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి ప్రతిపాదించారు. కేంద్రం అనుమతిస్తే హైదరాబాద్‌లో అలాంటి వార్ రూమ్ నిర్వహించేందుకు తెలంగాణ సిద్ధంగా ఉందని తెలిపారు. ప్రపంచ స్థాయి పరిశోధనలకు ఊతమిచ్చే ఏఐ యూనివర్సిటీని దేశంలో స్థాపించాలని సూచించారు. ఏఐ విస్తరణ నేపథ్యంలో ఉపాధిపై ఉద్భవిస్తున్న ఆందోళనలను ప్రస్తావిస్తూ.. కొన్ని రంగాల్లో ఉద్యోగ నష్టాలు సంభవించవచ్చని పేర్కొన్నారు.

## రోడ్డు నిర్మాణంలో లోపాలు ఉంటే చర్యలు



**గరుగుబిల్లి, పతాకం న్యూస్:** ఉపాధి హామీ నిధులతో నిర్మాణం చేపడు తున్న బీటీ రహదారుల నిర్మాణంలో లోపాలు ఉంటే చర్యలు తప్పవని పార్వతీపురం పంచా యతీరాజ్ శాఖ ఈఈ వీఎస్ నగేశ్‌బాబు హెచ్చరించారు. ప్రజలకు ఉపయోగపడే రహ దారి పనుల్లో నాణ్యతా లోపాలు ఉంటే చర్యలు తప్పవన్నారు. రహదారి నిర్మాణానికి సంబంధించి బెర్ములకు అవసరమైన మట్టిని వేరే ప్రాంతం నుంచి తరలించాల్సి ఉండగా, పెద్దూరు గ్రామ పరిధిలోని దక్షిణాయిని చెరువు గర్భంలోని మట్టిని వేసి రోలింగ్ చేశారన్నారు. రహదారి నిర్మాణానికి రూ. 3 కోట్లు మేర బీటీ రహదారి పనులకు నిధులు మంజూరయ్యాయన్నారు. చెరువు గర్భంలో తీసిన మట్టి ప్రాంతం లో అవసరమైన నిధులతో పూడ్చడం జరుగుతుందన్నారు. చెరువు గర్భం పూర్తిస్థాయిలో పూడ్చేంతవరకు రహదారి పనులు నిలుపుదల చేస్తున్నామన్నారు. దక్షిణాయిని చెరువుకు అధికంగా వరద తాకిడి నెలకొన్న దృష్ట్యా వరద నీరు బయటకు పోయేందుకు వీలుగా అవసరమైన కల్వర్టుల ను ఏర్పాటు చేయాలని మాజీ ఎంపీపీ మర్రాపు పురుషోత్తంనాయుడు ఆయన్ని కోరారు. పరిశీలనలో పంచాయతీరాజ్ శాఖ డీఈఈ ఎన్.వెంకటరావు, జేఈ జి.గౌరీ శంకర్‌తో పాటు రైతులు పాల్గొన్నారు.

## తరుగు లేకుండా బియ్యం అందజేయాలి



**గజపతినగరం, పతాకం న్యూస్:** ఎంఎల్ ఎస్ పాయింట్ నుంచి తరుగు లేకుండా బియ్యం సరఫరా చేసే విధంగా అధికారులు చర్యలు తీసుకో వాలని మండలంలోని డీలర్లు ఆందోళన చేపట్టారు. ఈ మేరకు వారు ఇన్‌చార్జి తహసీల్దార్ శోభ, సీఎస్‌డీటీ తరుపతిరావుకు వినతిపత్రాన్ని అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఎంఎల్‌ఎస్ పా యింట్ వద్ద ప్రతినెల తూకం లేకుండా రేషన్ డిపోల కు బియ్యం ఇస్తున్నారని తెలిపారు. రేషన్ షాపుల్లో లబ్ధిదారులకు ఈ-పాస్ విధానం ద్వారా బియ్యం అందజేస్తున్నామని, ఆ విధంగానే ఎంఎల్‌ఎస్ పాయిం ట్ అధికారులు కూడా రేషన్ డిపోలకు బియ్యం సరఫ రా చేయాలని వారు డిమాండ్ చేశారు. మండల డీల ర్ల సంఘం నాయకులు పాల్గొన్నారు.

## ఆల్ ఇండియా పోలీస్ సౌత్ జోన్ టీ20 క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభించిన అనిత



**అమరావతి, పతాకం న్యూస్:** అమరావతిలోని మంగళగిరి 6వ బెటాలియన్ ఏపీఎస్పీ వేదికగా జరిగిన “రెండవ ఆల్ ఇండియా పోలీస్ సౌత్ జోన్ టి20 క్రికెట్ టోర్నమెంట్”ను ఏపీ డీజీపీ హరీష్ కుమార్ గుప్తా మరియు ఇతర ఉన్నతాధికారులతో కలిసి రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నిరంతరం ప్రజా భద్రత కోసం 24 గంటలు శ్రమించే మన పోలీసు సోదరులకు మానసిక ఉల్లాసం మరియు ఐక్యతను పెంపొందించడానికి ఇటువంటి క్రీడలు ఎంతో అవసరమని పేర్కొన్నారు. సుమారు 6 రాష్ట్రాల నుండి వచ్చిన 10 జట్లకు శుభాకాంక్షలు తెలుపుతూ.. క్రీడల్లో గెలుపోటముల కంటే క్రీడా స్ఫూర్తితో పాల్గొనడమే ముఖ్యమని ఈ సందర్భంగా గుర్తు చేశారు. మన అమరావతిని ప్రపంచస్థాయి రాజధానిగా తీర్చిదిద్దే లక్ష్యంతో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ముందుకు సాగుతున్న తరుణంలో, ఇలాంటి జాతీయ స్థాయి క్రీడా కార్యక్రమాలు ఇక్కడ జరగడం శుభపరిణామమని పేర్కొన్నారు. ఫిబ్రవరి 20 నుండి 24 వరకు ఈ టోర్నమెంట్ జరగనుంది.

## 24, 25, 26 తేదీల్లో ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలకు క్రీడా పోటీలు.. ఏర్పాట్లపై స్పీకర్ సమీక్ష



**అమరావతి, పతాకం న్యూస్:** అధికారిక కార్యక్రమాలు, సమావేశాలు, పర్యటనలు, పార్టీ నేతలు, కార్యకర్తలతో తీరిక లేకుండా గడిపే ప్రజా ప్రతినిధులు 20, 30 ఏళ్లు వెనక్కి వెళ్లి క్రీడా పోటీల్లో హుషారుగా పాల్గొననున్నారు. మూడు రోజులపాటు నిర్వహించనున్న క్రీడా, సాంస్కృతిక కార్యక్రమాల్లో ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు రెట్టింపు ఉత్సాహంతో ఆటలు ఆడనున్నారు. శాసనసభ్యులకు 3 రోజుల పాటు ప్రత్యేక క్రీడా పోటీలను నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించి స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు అసెంబ్లీ ప్రాంగణంలో ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. నిరంతరం రాజకీయ ఒత్తిళ్లలో ఉండే ప్రతినిధులకు మానసిక ఉల్లాసాన్ని పంచేలా ఈ క్రీడోత్సవం ఉండాలని, ఏర్పాట్లు పక్కాగా ఉండాలని డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు, క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డిలతో కలిసి ఆయన చర్చించారు.

## కరాచిలో గ్యాస్ లీకేజీ ఘటనలో 16 మంది మృతి



**కరాచి, పతాకం న్యూస్:** పాకిస్తాన్ కరాచిలో ఓ నివాస భవనంలో గురువారం ఉదయం గ్యాస్ లేకేజి కారణంగా పేలుడు సంభవించింది. ఈ పేలుడు వల్ల 16 మంది మంది మృతి చెందారు. మృతుల్లో చాలామంది చిన్నారులున్నారు. 14 మంది గాయాలపాలయ్యారు. ఈ ఘటనకు సంబంధించి పోలీసు అధికారి జామ్‌షెడ్ అషెర్ మాట్లాడుతూ.. 'ఓల్డ్ సోల్జర్ బజార్ ప్రాంతంలో ఉన్న భవనంలోని మొదటి అంతస్తులో గురువారం ఉదయం 4.30 గంటల సమయంలో పేలుడు సంభవించింది. ఈరోజు రంజాన్ మాసం ప్రారంభం కానుంది. అందుకే తెల్లవారుజామున ముస్లింలు సెహ్రీ (ఉపవాసం సందర్భంగా తెల్లవారుజామున తీసుకునే ఆహారం) సందర్భంగా అందరూ మేల్కొని ఉన్నారు. ఈ సమయంలోనే ఈ పేలుడు సంభవించింది' అని ఆయన అన్నారు.

కాగా, ఈ ఘటన గ్యాస్ లీకేజీ వల్లనే జరిగిందని ఓ పోలీసు అధికారి పేర్కొన్నారు. కరాచిలో గ్యాస్ కొరత తీవ్రస్థాయిలో ఉంది. చాలామంది తక్కువ ఆదాయం వస్తున్న వారు. తమ ఇళ్లల్లో లిక్విడ్ పెట్రోలియం గ్యాస్ సిలిండర్‌లను ఉపయోగిస్తున్నారు. సంఘటనా స్థలం నుంచి 14 మృతదేహాలను స్వాధీనం చేసుకున్నామని పోలీస్ సర్జన్ డాక్టర్ సమయా సయ్యద్ ధృవీకరించారు. క్షతగాత్రులు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ పేలుడు కారణంగా భవన నిర్మాణంలో ఒక భాగం కూలిపోయింది. రెస్క్యూ ఆపరేషన్స్ చేపట్టి.. ఘటనలో స్థలంలో ఇంకెవరి మృతదేహాలున్నాయేమోనని వెతుకుతున్నట్లు చీఫ్ ఫైర్ ఆఫీసర్ హుమాయున్ ఖాన్ అన్నారు. మృతుల్లో రెండేళ్ళ నుంచి 17 ఏళ్ల మధ్య వయసు గల తొమ్మిది మంది పిల్లలున్నారు. గాయపడిన వారిలో కూడా ఏడుగురు పిల్లలున్నారు. కేవలం నెల రోజుల వ్యవధిలోనే కరాచిలో జరిగిన రెండవ అతిపెద్ద విషాదం ఇది. గత నెలలో సద్దార్ ప్రాంతంలోని హోల్‌సేల్ రిటైల్ మార్కెట్ అయిన గుల్ షాపింగ్ ప్లాజా బేస్‌మెంట్‌లో జరిగిన అగ్నిప్రమాదంలో 79 మంది మృతి చెందారు. అనేక మంది గాయాలపాలయ్యారు.

## ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి



**పార్వతీపురం, పతాకం న్యూస్:** ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి చేరవేయాల్సిన బాధ్యత ప్రభుత్వ ఉద్యోగులేనని, అటువంటి ఉద్యోగులు, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని జిల్లా కలెక్టర్ డా. ఎన్.ప్రభాకర రెడ్డి పేర్కొన్నారు. కలెక్టర్ కార్యాలయంలో సివిల్ జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ సమావేశంలో వివిధ ఉద్యోగ సంఘాల ప్రతినిధులతో కలెక్టర్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఉద్యోగ సంఘాల నేతలు ఉద్యోగులు, ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను కలెక్టర్ దష్టికి తీసుకువచ్చారు. వీటిపై సానుకూలంగా స్పందించిన కలెక్టర్ ఉద్యోగులకు ఏ రకమైన సమస్యలు ఉన్నా, సంకోచించకుండా నేరుగా తనను సంప్రదించవచ్చని భరోసా ఇచ్చారు. సమావేశం జరుగుతుండగానే, ఉద్యోగులు విన్నవించిన కొన్ని చిన్నపాటి సమస్యలకు కలెక్టర్ అప్పటికప్పుడే అధికారులతో మాట్లాడి పరిష్కారం చూపారు. ఇతర సమస్యలను కూడా త్వరలోనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. అలాగే పని ఒత్తిడికి గురవుతున్న గ్రామ,వార్డు సచివాలయ ఉద్యోగుల పని భారం తగ్గించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. ఐవీఆర్ఎస్ కాల్స్ పట్ల పునఃపరిశీలించాలని కోరగా, వాటిని పరిశీలించడం జరిగిందని తెలిపారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మార్చి 7న మహిళలతో ఆటలు, క్రీడలు, పాటలు వంటివి నిర్వహించుకొని సన్మానం చేసుకునేందుకు ఆ రోజు అనుమతిని మంజూరు చేశారు. అనంతరం వివిధ ఉద్యోగ సంఘ నాయకులు జిల్లా కలెక్టరును దుస్సాలువతో ఘనంగా సత్కరించారు. ఎపిఎన్‌జిఒ అసోసియేషన్ అధ్యక్షులు జివిఆర్ఎస్ కిషోర్, కార్యదర్శి కె.రంగాచారి మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ ఉద్యోగులకు అందిస్తున్న సహాయ సహకారాలతో జిల్లాను అభివృద్ధి పథంలో నడిపిస్తామన్నారు. సమావేశంలో ఎపి రెవెన్యూ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు గొట్టాపు శ్రీరామ్మూర్తి, లక్ష్మీకుమార్, యుటిఎఫ్ నాయకులు మురళీమోహన్, పిఆర్‌టియు తవిటి నాయుడు తదితరులు పాల్గొన్నారు.

# రైల్వే ఉద్యోగాల భర్తీకి ఆర్‌ఆర్‌బి నోటిఫికేషన్



**అమరావతి, పతాకం న్యూస్:** రైల్వే ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న వారికి ఇది నిజంగానే శుభవార్త. రైల్వే ఉద్యోగాలకు దరఖాస్తు చేయడానికి తెలుగు మాధ్యమాన్ని కూడా ఎంచుకోవచ్చు. ఇది తెలుగు రాష్ట్రాల అభ్యర్థులకు మరింత సౌకర్యవంతంగా ఉంటుంది. రైల్వే ఉద్యోగాలు ప్రభుత్వ ఉద్యోగాలు. రైల్వే ఉద్యోగులకు మంచి వేతనాలు, ఇతర అలవెన్సులు లభిస్తాయి. ఇది ఆర్థికంగా స్థిరత్వాన్ని అందిస్తుంది. అందుకే పటిష్టమైన ప్రణాళిక, మంచి ప్రిపరేషన్, సిలబస్‌ను సకాలంలో పూర్తిచేస్తే ఎంచక్కా ఈ ఉద్యోగాల్లో చేరొచ్చు. ఇంకెదుకు ఆలస్యం. ఆర్‌ఆర్‌బి పరీక్షలకు ప్రిపరేషన్ ప్రారంభించేయండి.

దేశవ్యాప్తంగా ఎప్పుడెప్పుడా అని నిరుద్యోగులు ఎదురుచూస్తున్న రైల్వే ఉద్యోగాల భర్తీకి రైల్వే రిక్రూట్‌మెంట్ బోర్డు (ఆర్‌ఆర్‌బి) నోటిఫికేషన్ ఇచ్చింది. ఆఖరి తేదీ వరకూ వేచిచూడకుండా అభ్యర్థులు గడువు ముందుగానే ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేయటం ఎంతో ఉత్తమం. ఏకంగా 22 వేల ఖాళీల భర్తీకి నోటోఫికేషన్ జారీ అయిన విషయం తెలిసిందే. అర్హత పదోతరగతి ఉత్తీర్ణత పొందితే చాలు. రైల్వే రిక్రూట్‌మెంట్ బోర్డు (ఆర్‌ఆర్‌బి) 2026 సంవత్సరానికి సంబంధించి గ్రూప్-డి ఉద్యోగాల భర్తీ ప్రక్రియను అధికారికంగా ప్రారంభించింది. భారతీయ రైల్వేలో సుమారు 22,195 ఖాళీలను భర్తీ చేయాలని నిర్ణయించింది. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగం సాధించాలనుకునే నిరుద్యోగ యువత ఈ అద్భుతమైన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటే జీవితంలో కేంద్రప్రభుత్వ ఉద్యోగిగా స్థిరపడొచ్చు. ఈ నోటిఫికేషన్ ద్వారా పాయింట్స్‌మెన్, ట్రాక్ మెయింటైనర్, అసిస్టెంట్ లోకో షెడ్, అసిస్టెంట్ ఆపరేషన్స్ వంటి వివిధ విభాగాల్లో పోస్టులను భర్తీ చేస్తారు. ఆసక్తి గల అభ్యర్థులు జనవరి 31 నుండి మార్చి 2 వరకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు. దరఖాస్తు రుసుం చెల్లించడానికి మార్చి 4 వరకు సమయం ఇచ్చారు. తప్పులు సరిచేసుకోవడానికి మార్చి 5 నుండి 14 వరకు ఎడిట్ ఆప్షన్ అందుబాటులో ఉంటుంది. విద్యార్హతల విషయానికి వస్తే, అభ్యర్థులు గుర్తింపు పొందిన బోర్డు నుండి 10వ తరగతి ఉత్తీర్ణత సాధించి ఉండాలి. కొన్ని సాంకేతిక పోస్టులకు ఐటీఐ లేదా నేషనల్ అప్రెంటిస్‌షిప్ సర్టిఫికెట్ తప్పనిసరి. జనవరి 1 నాటికి అభ్యర్థుల వయస్సు 18 నుండి 33 ఏళ్ల మధ్య ఉండాలి. రిజర్వేషన్ అభ్యర్థులకు ప్రభుత్వ నిబంధనల ప్రకారం గరిష్ట వయస్సులో సడలింపు లభిస్తుంది.

ఎంపిక ప్రక్రియ ప్రధానంగా నాలుగు దశల్లో జరుగుతుంది. మొదట కంప్యూటర్ ఆధారిత పరీక్ష (సిబిటి) నిర్వహిస్తారు. ఇందులో ప్రతిభ చూపిన వారిని శారీరక సామర్థ్య పరీక్షకు పిలుస్తారు. అనంతరం పత్రాల పరిశీలన, వైద్య పరీక్షలు పూర్తి చేస్తారు. అన్నీ సక్రమంగా ఉన్న వారిని మెరిట్ ప్రాతిపదికన తుది జాబితాకు ఎంపిక చేస్తారు.రాత పరీక్షలో జనరల్ సైన్స్, గణితం, రీజనింగ్, జనరల్ అవేర్‌నెస్ వంటి అంశాల నుండి ప్రశ్నలు అడుగుతారు. మొత్తం 100 ప్రశ్నలకు 90 నిమిషాల సమయం కేటాయిస్తారు. తప్పుడు సమాధానాలకు నెగటివ్ మార్కింగ్ విధానం అమలులో ఉంటుంది. అభ్యర్థులు క్రమశిక్షణతో కూడిన ప్రణాళికతో సిద్ధమైతే ఈ పరీక్షలో విజయం సాధించడం సులభం అవుతుంది. మొత్తం 4 విభాగాల నుంచి ప్రశ్నలు వస్తాయి. జనరల్ సైన్స్ విభాగం నుంచి 25 ప్రశ్నలు, మ్యాథమెటిక్స్ విభాగం నుంచి 25 ప్రశ్నలు, జనరల్ ఇంటలిజెన్స్ అండ్ రీజనింగ్ విభాగం నుంచి 30 ప్రశ్నలు, జనరల్ అవేర్‌నెస్ అండ్ కరెంట్ అఫైర్స్ విభాగం నుంచి 20 ఆబ్జెక్టిక్ ప్రశ్నలు అడుగుతారు. నెగెటివ్ మార్కింగ్ ఉంటుంది. ప్రతి తప్పు సమాధానానికి 1/3 వంతు మార్కులు కోత విధిస్తారు.


శారీరక సామర్థ్య పరీక్షలో పురుష అభ్యర్థులు 35 కేజీల బరువును 100 మీటర్ల దూరం రెండు నిమిషాల్లో మోయాలి. 1000 మీటర్ల దూరాన్ని నాలుగు నిమిషాల పదిహేను సెకన్లలో పరిగెత్తాలి. మహిళా అభ్యర్థులకు 20 కేజీల బరువు మోయడం వంటి వెసులుబాట్లు ఉంటాయి. శారీరక దృఢత్వం కలిగిన వారికి ఈ దశలో నెగ్గడం కష్టం కాదు. దేశవ్యాప్తంగా ఉన్న అన్ని రైల్వే రీజియన్ల వారీగా ఉద్యోగాల కేటాయింపు ఉంటుంది. ఆయా డివిజన్ల పరిధిలో అభ్యర్థులు ఉన్న ఖాళీలను దృష్టిలో పెట్టుకుని ప్రఖాళికాబద్ధంగా కృషిచేస్తే పరీక్షల్లో విజయం సాధించొచ్చు.

దరఖాస్తు చేసుకునే సమయంలో అభ్యర్థులు తమ ఆధార్ కార్డు వివరాలను సరిగ్గా నమోదు చేయాలి. ఫొటో, సంతకం నిర్దేశించిన పరిమాణంలో అప్‌లోడ్ చేయడం ముఖ్యం. నిబంధనల ప్రకారం ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ, పీహెచ్ అభ్యర్థులకు వయోపరిమితిలో సడలింపు ఉంటుంది. దరఖాస్తు సమయంలో జనరల్ ఈడబ్ల్యూఎస్, ఓబీసీ కేటగిరీ అభ్యర్థులు రూ.500 చెల్లించాలి. రాత పరీక్ష రాసిన వారికి రూ.400 రీఫండ్ చేస్తారు. ఇక ఎస్సీ, ఎస్టీ, ఈఎస్ఎం, ఈబీసీ, వికలాంగులు, మహిళా అభ్యర్థులు రూ.250 చొప్పున చెల్లించాలి. వీరు కూడా ఆన్‌లైన్ రాతపరీక్షకు హాజరైతే పూర్తి ఫీజు రీఫండ్ చేస్తారు. ఆన్‌లైన్ రాత పరీక్ష, ఫిజికల్ టెస్టులు, ధ్రువపత్రాల పరిశీలన ఆధారంగా ఈ నియామకాలు చేపడతారు. ఎంపికైన అభ్యర్థులకు 7వ వేతన సంఘం ప్రకారం లెవెల్ 1 పోస్టులకు నెలకు రూ.18వేలు జీతంతోపాటు నిబంధనల మేరకు డీఏ, హెచ్‌ఆర్ఎ, ఇతర అలవెన్సులతో సుమారు రూ.35 వేలు వరకూ మొదటి నెల నుంచే పొందొచ్చు. రైల్వే శాఖలో ఉపాధితో పాటు మంచి భవిష్యత్తు, పదోన్నతులు ఉంటాయి.

దేశ వ్యాప్తంగా ఉన్న రైల్వే రీజియన్లలో గ్రూప్ 4 ఉద్యోగాలకు ఆర్‌ఆర్‌బి విడుదల చేసిన నోటిఫికేషన్ ద్వారా టెన్త్, ఐటీఐ, అప్రెంటిస్ అర్హత కలిగిన అభ్యర్థులు ఆన్‌లైన్ విధానంలో దరఖాస్తు చేసుకోవచ్చు. ఈ నోటిఫికేషన్ కింద మొత్తం 22,195 గ్రూప్ డి ఉద్యోగాలను భర్తీ చేయనుంది. ఈ పోస్టుల్లో సికింద్రాబాద్ రీజియన్‌లో మొత్తం 1012 వరకూ పోస్టులు ఉన్నాయి. ఇందులో పాయింట్స్‌మెన్, అసిస్టెంట్, ట్రాక్ మెయింటెయినర్, అసిస్టెంట్, అసిస్టెంట్ లోకో షెడ్, అసిస్టెంట్ ఆపరేషన్స్ తదితర ఖాళీలు ఉన్నాయి. ట్రాఫిక్, ఇంజినీరింగ్, మెకానికల్, ఎలక్ట్రికల్ తదితర విభాగాల్లో వీటిని భర్తీ చేస్తారు. ఆసక్తి కలిగిన వారు మార్చి 2, 2026వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చు.

# పేదల కడుపుకొడుతున్న బీజేపీ: షర్మిల ఫైర్

**వినుకొండ, పతాకం న్యూస్:** పేదల కడుపుకొట్టేలా బిజెపి ప్రభుత్వం చేస్తున్న మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం రద్దు కుట్రలను ఆపాలని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు వైఎస్.షర్మిల డిమాండ్ చేశారు. ఎంఎన్ఆర్ఇజిఎస్ పరిరక్షణ యాత్రలో భాగంగా వినుకొండ నియోజకవర్గంలోని శావల్యాపురం మండలం వేల్పూరు గ్రామంలో రచ్చబండ కార్యక్రమాన్ని నిర్వహించారు. షర్మిల మాట్లాడుతూ ఉపాధి హామీ చట్టం ఊపరిని కేంద్రంలోని బిజెపి తీస్తుండగా రాష్ట్రంలో సిఎం చంద్రబాబు, డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్, ప్రతిపక్ష నాయకుడు జగన్మోహన్‌రెడ్డి నోరు విప్పక పోవటం ఏమిటని ప్రశ్నించారు. వైఎస్సార్ ఆశయాల నుంచి పుట్టిన చట్టాన్ని చంపుతుంటే జగన్మోహన్‌రెడ్డి చోద్యం చూడడం అన్యాయమన్నారు. ప్రశ్నించాల్సిన వీరు మోడీకి సాగిల పడడం దుర్మార్గమన్నారు. గ్రామాల్లో కరువు, వలసలను తగ్గించి పేదలను ఆదుకునేందుకు పుట్టిన చట్టం ఉపాధి హామీ అని చెప్పారు. కొత్తగా తెచ్చిన విబి గ్రామ్‌జి పథకం ద్వారా గ్రామాల్లో జరిగే పనులకు గ్రామసభల నిర్ణయాన్ని తొలగించి ఢిల్లీ నుంచి నిర్ణయిస్తాను చెప్పడం ఉపాధిని నీరుగార్చడమేనన్నారు. ఇందులోనూ కాంట్రాక్టర్లకు పెద్దపీట వేశారని, వారికి కూలీలను సరఫరా చేసే వ్యవస్థగా ఉపాధి పథకాన్ని తెచ్చారని విమర్శించారు. విబి గ్రామ్‌జి పథకంలో 40 శాతం నిధులను రాష్ట్రం భరించాలంటే రూ.5 వేల కోట్లు భారం పడుతుందని, రాష్ట్రం ఇప్పటికే రూ.11 లక్షల కోట్ల అప్పుల్లో ఉందని, ప్రభుత్వాన్ని నడిపేందుకు ఏటా రూ.లక్ష కోట్లు అప్పులు తెచ్చే పరిస్థితి నెలకొందని చెప్పారు. కార్మికులకు భారంపడే చట్టంపై టిడిపి ఎందుకు మద్దతు ఇచ్చిందని, ఉపాధి హామీ కూలీలకు అన్యాయం జరిగే చట్టంపై వైసిపి పోరాటాలు ఎందుకు చేయడం లేదని ప్రశ్నించారు. రాష్ట్ర అభివృద్ధిపై వీరికి చిత్తశుద్ధి లేదన్నారు. పోలవరం ప్రాజెక్టు తీరని అన్యాయం చేశారన్నారు. రాష్ట్ర అభివృద్ధి చెందాలంటే కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావాలన్నారు. కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు అలెగ్జాండర్ సుధాకర్, ఇతర నాయకులు పాల్గొన్నారు.



## పైడితల్లి జాతరను ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించాలి



**రాజాం, పతాకం న్యూస్:** రాజాంలో ఈనెల 22 నుంచి 24 వరకూ పోలిపల్లి పైడితల్లి అమ్మవారి జాతరను ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని ఎమ్మెల్యే కోండ్రు మురళీ మోహన్ పిలుపునిచ్చారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాల మేరకు దేవదాయశాఖ అమ్మవారి శత వసంతాల పండుగను రాష్ట్ర పండుగగా గుర్తించిందని, ఈ మేరకు జాతర నిర్వహణకు రూ.50లక్షలు కేటాయించించారని ఆయన గుర్తు చేశారు. ఆయన స్థానిక ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో పోలీస్, రెవెన్యూ, మున్సిపాలిటీ, ఆర్‌అండ్‌బీ, ట్రాన్స్‌కో, ఎండోమెంట్, ఫైర్ తదితర శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. జాతరలో పారిశుధ్య నిర్వహణ, తాగునీరు, తాత్కాలిక మురగుదొడ్లు ఏర్పాటు, వైద్యశిబిరాల నిర్వహణ తదితర అంశాలపై చేయనున్న ఏర్పాట్లను మున్సిపల్ కమిషన ర్ రామచంద్రరావు వివరించారు. పైడితల్లి దేవస్థానం ఈవో బీవీ మాధవరావు, ఆర్‌అండ్‌బీ ఏఈ నాగభూష ణరావు, ట్రాన్స్‌కో ఏఈ కుమార్, రాజాం ఏరియా ఆసు పత్రి సూపరింటెండెంట్ డా.కరణం హరిబాబు తదితరులు జాతరలో చేపట్టబోయే కార్యక్రమాలను వివరించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జాతరలో ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ సంఘటన లు జరగకుండా పోలీసు శాఖ అప్రమత్తం కావాలన్నా రు. వైద్య, అగ్నిమాపక, పారిశుధ్య అధికారులకు వివిధ సూచనలు చేశారు. పైడితల్లి జాతరను రాష్ట్ర పండుగ గా గుర్తించిన నేపథ్యంలో టీడీపీ నాయకుడు దుప్పల పూడి శ్రీనివాసరావుతో పాటు నాలుగు మండలాలకు చెందిన పార్టీ నాయకులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలి పారు. అంతకుముందు అమ్మవారిని ఎమ్మెల్యే దర్శించు కున్నారు. అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

## బిహార్‌లో పూర్తైన ఎస్ఐఆర్ ప్రక్రియ.. మరో 9 రాష్ట్రాల్లో కొనసాగుతున్న ఎస్ఐఆర్




**న్యూఢిల్లీ, పతాకం న్యూస్:** ఓటరు జాబితాకు సంబంధించి దేశవ్యాప్తంగా స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్(ఎస్ఐఆర్) నిర్వహించనున్నట్లు ప్రకటించిన ఎన్నికల కమిషన్ ఆ దిశగా చర్యలను ముమ్మరం చేసింది. ఎస్ఐఆర్‌కు సంబంధించి సన్నాహాక పనులు వీలైనంత త్వరగా పూర్తి చేయాలని 22 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలకు ఈసీ సూచించింది. ఏప్రిల్ నుంచి ఎస్ఐఆర్ మొదలయ్యే అవకాశం ఉంది. 22 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో ఎస్ఐఆర్ పూర్తయితే దేశమంతా ఆ ప్రక్రియ సంపూర్ణమవుతుంది. ఎస్ఐఆర్ ప్రక్రియ బిహార్‌లో పూర్తి కాగా మరో 9 రాష్ట్రాల్లో కొనసాగుతోంది. అసోంలో ఎస్ఐఆర్ స్థానంలో నిర్వహించిన ఎస్ఐఆంఈనెల 10న పూర్తయినట్లు ఎన్నికల సంఘం ప్రకటించింది.

## బైక్‌పై వెనుక కూర్చున్నవారూ కూడా హెల్మెట్ పెట్టుకోవాలి



**మాచర్ల, పతాకం న్యూస్:**పట్టణంలో ట్రాఫిక్ నియమాలను ప్రతి వాహనదారు కచ్చితంగా పాటించాల్సిందేనని సిఐ తురక వెంకటరమణ స్పష్టం చేశారు. రోడ్డు భద్రతపై అవగాహన కల్పించే కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని ప్రధాన కూడళ్ల వద్ద వాహనదారులతో నేరుగా మాట్లాడి సూచనలిచ్చారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని, వెనుక కూర్చునే వారు కూడా హెల్మెట్ వాడాలని సూచించారు. మైనర్లు వాహనాలు నడిపితే తల్లిదండ్రులపై కూడా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. డ్రంక్ అండ్ డ్రైవ్, సెల్‌ఫోన్ డ్రైవింగ్, ర్యాష్ డ్రైవింగ్ వంటి ఉల్లంఘనలపై ప్రత్యేక దృష్టి సారించామని చెప్పారు. ప్రత్యేక డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు, ఆకస్మిక చెకింగ్‌లు, రాత్రి పూట నిఘా చర్యలు కొనసాగుతున్నాయని అన్నారు. సీటు బెల్ట్ ధరించకపోవడం, ట్రిపుల్ రైడింగ్, ఓవర్ స్పీడ్ వంటి నిబంధనల ఉల్లంఘనలపై భారీ జరిమానాలు విధిస్తున్నట్లు తెలిపారు. ప్రమాదాల నివారణ కోసం ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని విజ్ఞప్తి చేశారు. పట్టణంలో పెరుగుతున్న వాహన రద్దీ నేపథ్యంలో రోడ్డు భద్రత అత్యంత కీలకమని, నిబంధనలు పాటించడం ద్వారా ప్రమాదాలను గణనీయంగా తగ్గించవచ్చని అన్నారు.

## సర్పంచ్‌లకు ఏపీ సర్కార్ గుడ్ న్యూస్.. నిధుల వినియోగానికి గ్రీన్ సిగ్నల్




**అమరావతి, పతాకం న్యూస్:** రాష్ట్రంలోని గ్రామ పంచాయతీ సర్పంచ్‌లకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం శుభవార్త చెప్పింది. 15వ ఆర్థిక సంఘం నిధుల వినియోగానికి అనుమతి ఇస్తూ కీలక ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ అధికారికంగా ఆదేశాలు ఇచ్చింది. ప్రభుత్వ తాజా నిర్ణయంతో గ్రామాల్లో పెండింగ్‌లో ఉన్న బిల్లుల చెల్లింపు ప్రక్రియ వేగవంతం కానుంది. జనవరి 5వ తేదీన గ్రామ పంచాయతీలు చేసిన తీర్మానాల ఆధారంగా ఈ నిధులను వినియోగించుకోవాలని ప్రభుత్వం తన ఉత్తర్వుల్లో స్పష్టం చేసింది. ఇప్పటికే పూర్తి చేసిన పనులకు సంబంధించిన వివరాలను మెజర్‌మెంట్ పుస్తకాలలో నమోదు చేసి ఉంటే, ఆ బిల్లులను చెల్లించవచ్చని తెలిపింది. గ్రామాల్లో చేపట్టిన వివిధ అభివృద్ధి పనులకు సంబంధించిన బిల్లులు చాలాకాలంగా పెండింగ్‌లో ఉండటంతో సర్పంచ్‌లు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో, 15వ ఆర్థిక సంఘం నిధులను వాడుకునేందుకు ప్రభుత్వం అనుమతి ఇవ్వడం వారికి ఊరట కలిగించే అంశం. ఈ నిర్ణయంతో పంచాయతీల్లో నిలిచిపోయిన చెల్లింపులకు మార్గం సుగమం అయినట్లయింది.

## రూ.13,000 కోట్ల గేమింగ్ స్కామ్.. కీలక సూత్రధారి అరెస్ట్

**హైదరాబాద్, పతాకం న్యూస్:** దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన రూ.13,000 కోట్ల విలువైన ఆన్‌లైన్ గేమింగ్ స్కామ్‌లో హైదరాబాద్ జీఎస్టీ ఇంటెలిజెన్స్ అధికారులు కీలక పురోగతి సాధించారు. ఈ భారీ మోసంలో ప్రధాన సూత్రధారులలో ఒకరైన పంకజ్ కుమార్‌ను అరెస్ట్ చేశారు. అడ్సమ్ అడ్వైజరీ సర్వీస్ ప్రైవేట్ లిమిటెడ్ వ్యవస్థాపకుడు, డైరెక్టర్‌గా ఉన్న పంకజ్ కుమార్, ఈ స్కామ్‌లో కీలకంగా వ్యవహరించినట్టు అధికారులు గుర్తించారు. చట్టవిరుద్ధమైన ఆన్‌లైన్ గేమింగ్ వెబ్‌సైట్లకు అండగా నిలుస్తూ, వాటి కార్యకలాపాలకు సహకరించడమే లక్ష్యంగా ఈ సిండికేట్ పనిచేసింది. ఇందులో భాగంగా, పంకజ్ కుమార్ నకిలీ కేవైసీ పత్రాలను సృష్టించడంలో కీలక పాత్ర పోషించారు. డొల్ల కంపెనీలు (షెల్ ఎంటిటీలు), నకిలీ వ్యాపారుల పేరిట మోసపూరిత కేవైసీలను తయారు చేసి, వాటి ద్వారా ఆర్‌బీఐ నియంత్రణలో ఉండే పేమెంట్ గేట్‌వేలు, బ్యాంకుల నుంచి పేమెంట్ అగ్రిగేటర్ సేవలను పొందినట్టు దర్యాప్తులో తేలింది. ఈ నకిలీ కేవైసీల ద్వారా గేమింగ్ వెబ్‌సైట్లు తమ అక్రమ లావాదేవీలను చట్టబద్ధమైనవిగా చిత్రీకరించే ప్రయత్నం చేశాయి. ఫిన్‌టెక్ కంపెనీల సహాయంతో ఈ వ్యవస్థీకృత ముఠా భారీ ఎత్తున మోసాలకు పాల్పడినట్టు జీఎస్టీ అధికారులు తెలిపారు. ఈ కేసులో పంకజ్ కుమార్ అరెస్ట్ అత్యంత కీలకమని, దర్యాప్తును మరింత లోతుగా కొనసాగిస్తున్నామని అధికారులు వెల్లడించారు.

## 23 నుండి ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలు

### నిమిషం ఆలస్యమైనా పరీక్షకు అనుమతించం: నీలావతిదేవి



**పల్నాడు, పతాకం న్యూస్:** ప్రతి విద్యార్థి జీవితంలో ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలు ముఖ్యమైనవని, వారి భవిష్యత్తును నిర్ణయించే ఈ పరీక్షలు ఈనెల 23న ప్రారంభమై వచ్చేనెల 24వరకు కొనసాగుతాయని పల్నాడు జిల్లా ఇంటర్మీడియట్ బోర్డు అధికారి ఎం.నీలావతిదేవి అన్నారు. పరీక్షల నిర్వహణకు ఏర్పాట్లు, అధికారుల నియామకం, నిబంధనలు తదితర అంశాలను ఆమె వివరించారు. ఇప్పటికే విద్యార్థులకు హాల్ టిక్కెట్లు పంపిణీ చేశామని, ఇంకా ఎవరైనా విద్యార్థులు హాల్ టిక్కెట్ తీసుకోకపోతే వెంటనే తీసుకోవాలని సూచించారు. పల్నాడు జిల్లాలో 49 పరీక్ష కేంద్రాల్లో మొదటి ఏడాది 16594 మంది, ద్వితీయ ఏడాది 15628 మంది, ఒకేషనల్ కోర్సులకు సంబంధించి మొదటి ఏడాది 1146 మంది, ద్వితీయ ఏడాది 1008 మంది విద్యార్థులు హాజరుకానున్నారని వివరించారు. విద్యార్థులు ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాసేలా ఏర్పాట్లు చేశామన్నారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్ష ఉంటుందని, పరీక్ష సమయానికి గంట ముందే కేంద్రానికి విద్యార్థులు చేరుకోవాలని, ఒక్క నిమిషం ఆలస్యమైనా పరీక్ష కేంద్రంలోకి అనుమతి ఉండదని స్పష్టం చేశారు. కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమల్లో ఉంటుందన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద సమస్యలు తలెత్తితే విద్యార్థులు కంట్రోల్ రూమ్ నంబర్ 08647 223355కు సంప్రదించవచ్చని అన్నారు. పరీక్ష సామగ్రి సెంటర్‌కు పంపించామని, ప్రశ్న పత్రాలు సెంటర్ల పరిధిలోని 16 పోలీస్ స్టేషన్‌లకు చేర్చామని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 2 ఫ్లైయింగ్ స్క్వాడ్, 2 సిట్టింగ్‌లతో పాటు పోలీసు, రెవెన్యూ బృందాలు, చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్టుమెంటల్ ఆఫీసర్లు, ఇన్విజిలేటర్ల నియామకం పూర్తయిందని, అన్ని పరీక్ష కేంద్రాలలో సిసి కెమెరాల పర్యవేక్షణలో పరీక్షలు నిర్వహిస్తున్నామని చెప్పారు. విద్యార్థులు, పరీక్షల విధుల్లో ఉన్న అధికారులకు ఫోన్ వినియోగం నిషేధించామని, ఎవరైనా వాడితే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎక్కడ చిన్న ఇబ్బంది కలిగినా తక్షణ చర్యలు తీసుకునేలా జిల్లా కలెక్టర్ నుండి అనుమతులు లభించాయని చెప్పారు.

## 25 వరకు సాగు నీరు విడుదల

**నరసరావుపేట, పతాకం న్యూస్:** నరసరావుపేట మండలంలోని కేతిముక్కల అగ్రహారం గ్రామాన్ని పల్నాడు జిల్లా వ్యవసాయ అధికారి ఎం. జగ్గారావు, ఎన్ఎస్‌పి డిఇ ఎం.ఉమాశంకర్ సందర్శించారు. సాగు నీరు విడుదల చేసి ఎండిపోతున్న మొక్కజొన్న పొలాలను కాపాడాలని కోరుతూ గ్రామ రైతులు ఇటీవల ఎన్ఎస్‌పి కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టిన నేపథ్యంలో మొక్కజొన్న పొలాలను అధికారులు పరిశీలించి, రైతులతో మాట్లాడారు. నీటి కోసం ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ఈనెల 25 వరకు సాగునీరు సరఫరా చేస్తామని చెప్పారు. నీటి వృథాను అరికట్టి సక్రమంగా పొలాలకు మళ్లించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సహాయ వ్యవసాయ సంచాలకులు కెవి.శ్రీనివాసరావు, ఏఈ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

# డయాబెటిస్ ఉందా? రోజూ తగినంత నీటిని తప్పకుండా తాగాలి..

డయాబెటిస్ ఉందా..? రోజూ తగినంత నీటిని తప్పకుండా తాగాల్సిందే.. ఎందుకంటే..? డయాబెటిస్ తో బాధపడే వారు గ్లూకోజ్ స్థాయిలను సమతుల్యంగా ఉంచడానికి, ఇన్సులిన్ నిరోధకతను తగ్గించడానికి హైడ్రేటెడ్ గా ఉండడం చాలా అవసరం. నీరు తాగడం వల్ల రక్తంలో చక్కెర స్థాయిలు ప్రభావితం అవుతాయని వైద్యులు చెబుతున్నారు. డయాబెటిస్ తో బాధపడే వారు గ్లూకోజ్ స్థాయిలను సమతుల్యంగా ఉంచడానికి, ఇన్సులిన్ నిరోధకతను తగ్గించడానికి హైడ్రేటెడ్ గా ఉండడం చాలా అవసరం. నీరు తాగడం వల్ల రక్తంలో చక్కెర స్థాయిలు ప్రభావితం అవుతాయని వైద్యులు చెబుతున్నారు. నీటిలో క్యాలరీలు, కార్బోహైడ్రేట్స్ వంటివి ఉండవు. కానీ నీరు తాగడం వల్ల తగినంత హైడ్రేషన్ ఉండడం వల్ల శరీరం గ్లూకోజ్ ను మరింత సమర్థవంతంగా ప్రాసెస్ చేసుకుంటుంది. అలాగే ఇన్సులిన్ సెన్సిటివిటీ పెరుగుతుంది. నీరు తక్కువగా తాగడం వల్ల శరీరం డీహైడ్రేషన్ కు గురవుతుంది. దీంతో రక్తంలో గ్లూకోజ్ సాంద్రత ఎక్కువగా కనిపిస్తుంది.

డీహైడ్రేషన్ కారణంగా చక్కెర స్థాయిలు ఎక్కువగా కనిపిస్తాయి. జీవక్రియ నియంత్రణ మరింత కష్టంగా మారుతుంది. శరీరం హైడ్రేటెడ్ గా ఉండడం వల్ల గ్లూకోజ్ పలుచగా మారుతుంది. మూత్రపిండాలు అదనపు చక్కెరలను సజావుగా బయటకు పంపిస్తాయి. ఒత్తిడి హార్మోన్లు అదుపులో ఉండడం వల్ల ఇన్సులిన్ నిరోధకత కూడా తగ్గుతుంది. నీరు




రక్తంలో చక్కెర స్థాయిలను తగ్గించనప్పటికీ గ్లూకోజ్ స్థాయిలను, ఇన్సులిన్ నిరోధకతను నీరు ప్రభావితం చేస్తుందని వైద్యులు చెబుతున్నారు.

సాధారణంగా మనం డీహైడ్రేషన్ కు గురైనప్పుడు ఆకలి ఎక్కువగా అవ్వడం లేదా తీపి తినాలనిపించడం వంటివి జరుగుతాయి. కొన్నిసార్లు దాహాన్ని శరీరం ఆకలిగా తప్పుగా అర్థం చేసుకుంటుంది. దీని వల్ల చిరుతిళ్లు తినాలనే కోరిక కలగడంతో పాటు భోజనం తరువాత రక్తంలో చక్కెర స్థాయిలు కూడా పెరుగుతాయి. రోజంతా క్రమం తప్పకుండా నీటిని తాగుతూ శరీరాన్ని హైడ్రేటెడ్ గా ఉంచడం వల్ల తప్పుడు ఆకలి సంకేతాలను తగ్గించవచ్చు, ఆకలి నియంత్రణలో ఉంటుంది. కనుక భోజనంతో పాటు భోజనం విరామ సమయంలో, వ్యాయామం చేసిన తరువాత క్రమం తప్పకుండా నీటిని తాగాలి. శరీరం ఎల్లప్పుడూ హైడ్రేటెడ్ గా ఉండేలా చూసుకోవాలి. దీంతో శరీరం మొత్తం జీవక్రియ మెరుగుపడుతుంది.

నీరు తాగడంతో పాటు సమతుల్య ఆహారాన్ని తీసుకోవడం, ఫైబర్, ప్రోటీన్ వంటి ఆహారాలను ఎక్కువగా తీసుకోవడం వల్ల రోజంతా రక్తంలో చక్కెర స్థాయిలు స్థిరంగా ఉండేలా చూసుకోవచ్చు.

నీరు స్వయంగా చక్కెర స్థాయిలను తగ్గించకపోయినా తగినంత హైడ్రేషన్ శరీరం గ్లూకోజ్ స్థాయిలను సమతుల్యం చేసే సామర్థ్యాన్ని ప్రోత్సహిస్తుంది. కనుక శరీరం ఎల్లప్పుడూ హైడ్రేట్ గా ఉండేలా నీటిని తాగుతూ ఉండాలి. నీరు తాగడం వల్ల మొత్తం శరీర ఆరోగ్యం మెరుగుపడుతుందని వైద్యులు చెబుతున్నారు.

# రాష్ట్రంలో ప్రథమంగా తాడేపల్లిలో స్మార్ట్ స్ట్రీట్



**తాడేపల్లి, పతాకం న్యూస్:** అభివృద్ధి పనులను నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ సకాలంలో పూర్తయ్యేలా అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశించారు. మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలో అభివృద్ధి పనులు పురోగతిని కలెక్టర్ పరిశీలించారు. ఖాజాలోని యానిమల్ బర్త్ కంట్రోల్ (ఎబిసి) కేంద్రంలో డాగ్స్ కెన్నల్స్, ప్రీ ఆపరేషన్ గది, ఆపరేషన్ గది, ఫుడ్ ఫీడింగ్ ఏరియాను, రికార్డులను పరిశీలించారు. ఎబిసి సెంటర్ లో వీధి కుక్కలకు కుటుంబ నియంత్రణ సర్జరీలు సజావుగా నిర్వహించి పూర్తి ఆరోగ్యంగా ఉండేలా నిరంతరం వైద్య సేవలు అందించాలన్నారు. కాజాలో ఎ 17. 18 సెంట్లలోని ఈస్ట్ లేక్ వద్ద రూ.2.70 కోట్లు తో ఏర్పాటు చేస్తున్న వాకింగ్ ట్రాక్, పిల్లల పార్కు, మొక్కల పెంపకం పనులను, ఎన్ఆర్ఐ సమీపంలో ఎంటీఎంసీ, సిఎస్ఆర్ నిధులు రూ.46 లక్షలతో 0.75 ఎకరాల్లో నిర్మిస్తున్న వైట్ ఫీల్డ్ పార్కులో పనులను కలెక్టర్ పరిశీలించారు. వాకింగ్ ట్రాక్ పూర్తిగా చదునుచేయాలని, పార్క్‌లను సజావుగా నిర్వహించాలని చెప్పారు. కాళి మాత దేవాలయం సమీపంలో స్వయం సహాయక సంఘాల సభ్యుల నిర్వహణలో పనిచేస్తున్న యాస్పిరేషనల్ టాయిలెట్లను పరిశీలించారు. పర్యావరణహితంగా ప్లాస్టిక్ వినియోగాన్ని అరికట్టేందుకు అవగాహన కల్పిస్తూ అక్కడ కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఎనీ టైం బ్యాగ్ కీయోస్క్ పనితీరును పరిశీలించారు. మరుగుదొడ్ల నిర్వహణ చక్కగా ఉందని అభినందించారు. కొలనుకొండలో కమ్యూనల్ స్థలాలను పరిశీలించి, నివేదిక అందించాలని తహశీల్దార్‌కు సూచించారు. తాడేపల్లిలోని ఆంధ్ర రత్న పంపింగ్ స్టేషన్ నుంచి పాతురు వెళ్లే రోడ్డులో మెప్మా ఆధ్వర్యంలో 40 షాపులతో ఏర్పాటు చేస్తున్న స్మార్ట్ స్ట్రీట్ స్థలాన్ని పరిశీలించారు. ప్రజలకు ఆహ్లాదకరంగా వాతావరణంలో స్వయం సహాయక సంఘాల ఉత్పత్తులు అమ్ముకునేలా స్మార్ట్ స్ట్రీట్‌ను తీర్చిదిద్దాలని అధికారులకు సూచించారు. స్మార్ట్ స్ట్రీట్ రాష్ట్రంలో ప్రథమంగా ప్రయోగాత్మకంగా ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ట్రాఫిక్ రద్దీకి అనుగుణంగా రూ.1.69 కోట్లతో అభివృద్ధి చేస్తున్న ఉండవల్లి సెంటరులో పనులను పరిశీలించారు. రాజధాని ప్రాంతం నుంచి వచ్చే వాహనాలకు ఇబ్బందులు లేకుండా విస్తరణ పనులను సకాలంలో పూర్తి చేయాలని అన్నారు. నులకపేటలోని నాలుగు ఎకరాల చెరువును అమరావతి డెవలప్మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ ఆధ్వర్యంలో రూ.6 కోట్లతో జరుగుతున్న పనులను పరిశీలించి, అధికారుల నుంచి వివరాలు తెలుసుకున్నారు. తాడేపల్లి తహశీల్దార్ కార్యాలయంను, స్వర్ణ వార్డు కార్యాలయంను సందర్శించి, అన్ని విభాగాలను పరిశీలించారు. పొడి వ్యర్థాల నిర్వహణకు ప్రకాష్ నగర్‌లో రూ. 96.74 లక్షలతో నిర్మించి ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉన్న మెటీరియల్ రికవరీ ఫెసిలిటీ కేంద్రాన్ని కలెక్టర్ పరిశీలించారు. పొడి వ్యర్థాలతో పాటు ఎలక్ట్రానిక్ వ్యర్థాలను సక్రమంగా నిర్వహణ చేయాలని అధికారులకు సూచించారు. పారిశుధ్యం, రక్షిత తాగునీరు సరఫరాకు అత్యధిక ప్రాధాన్యంపారిశుధ్యం, రక్షిత నీరు సరఫరాకు ప్రాధాన్యతిస్తూ ప్రభుత్వం అవసరమైన అన్ని చర్యలు పకడ్బందీగా తీసుకుంటుందని జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా తెలిపారు. నియోజకవర్గంలో అభివృద్ధి, రెవెన్యూ అంశాలపై మంగళగిరి-తాడేపల్లి నగరపాలక సంస్థ కార్యాలయంలో కలెక్టర్ సమీక్షించారు. తాగునీటి సరఫరా, పారిశుధ్యం, డ్రెయినేజీ, విద్యుత్ సరఫరాపై ప్రజలు తెలిపిన సమస్యలు తక్షణమే పరిష్కరించాలన్నారు. తాడేపల్లి, మంగళగిరి, దుగ్గిరాల మండలాల్లో ఇంటి స్థలాల రెగ్యులైజేషన్ దరఖాస్తులు వెంటనే పరిష్కరించాలని చెప్పారు. నిషేధిత భూములు జాబితాల నుంచి స్థలాల తొలగింపు, ఇతర భూ సమస్యలకు సంబంధించిన దరఖాస్తుల పరిష్కారం కోసం నిర్దేశిత మార్గదర్శకాలు ప్రకారం నివేదికలను అందించాలన్నారు. ఏంటీఎంసీ పరిధిలో యూజీడీ పనులు వెంటనే ప్రారంభించాలని, కెఎల్ యూనివర్సిటీ రహదారి విస్తరణ పనులను వెంటనే ప్రారంభించాలని, రేవేంద్రపాడు బ్రిడ్జి, ఉండవల్లి, రహదారి విస్తరణ పనులు వేగవంతం చేయాలని సూచించారు. దుగ్గిరాల మండలంలో హౌసింగ్ లేఅవుట్ లలో కాంట్రాక్టర్ స్టేజ్ డివియేషన్ వెంటనే సరి చేయాలన్నారు. అభివృద్ధి పనుల నిర్వహణలో ఇబ్బందులుంటే సత్వరమే జిల్లా స్థాయి అధికారులు దృష్టికి తేవాలని చెప్పారు. సమీక్ష అనంతరం విలేకర్లతో మాట్లాడుతూ నూతన పార్కుల పనులు 80 శాతం పూర్తయ్యాయని, త్వరలోనే ప్రారంభిస్తామని అన్నారు. తాడేపల్లిలో మెప్మా ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన స్మార్ట్ స్ట్రీట్ బజార్లును మే నాటికి పూర్తి చేసేలా ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. వేసవిలో తాగునీటికి ఇబ్బంది లేకుండా సమ్మర్ యాక్షన్ ప్లాన్ సమర్థవంతంగా అమలుకు చర్యలు తీసుకుంటున్నా మన్నారు. నిడమర్రు వద్ద ఆర్వోబీ ని సాధ్యమైనంత వరకు ప్రజలకు ఇబ్బందులు లేకుండా నిర్మించేందుకు ఉన్న అన్ని అవకాశాలను పూర్తిస్థాయిలో పరిశీలిస్తున్నామని చెప్పారు.

## ఏపీఎస్ఆర్టీసీలో ప్రైవేట్ భాగస్వామ్యాన్ని వ్యతిరేకిస్తూ ధర్నా




**కర్నూలు, పతాకం న్యూస్:** రాష్ట్రంలో మొదటి విడతగా 12 డిపోలలో ప్రైవేటు భాగస్వామ్యంతో ప్రైవేట్ విద్యుత్ బస్సులను ఏపీఎస్ఆర్టీసీలో ప్రవేశపెట్టడాన్ని నిరసిస్తూ కర్నూల్ 1 మరియు 2 డిపోల వద్ద ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శులు కె .కె.కుమార్ ,మద్దిలేటి , జిల్లా అధ్యక్షులు రంగస్వామి , జిల్లా కార్యదర్శి ఏవి రెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. స్త్రీ శక్తి పథకం విజయవంతం కావాలన్నా, ప్రజలకు మెరుగైన సేవలు అందించాలన్న విద్యుత్ బస్సులను ఆర్టీసీ నే నిర్వహిస్తే మేలు జరుగుతుందని, లేదంటే అనేక సమస్యలు ఏర్పడతాయని అన్నారు. పేద మధ్యతరగతి కుటుంబాలకు, విద్యార్థులకు ఆసరాగా ఉండే ఆర్టీసీ ని ప్రైవేట్ పరం చేయవద్దని కోరారు. ఆర్టీసీ డిపోలను ,స్థలాలను ప్రైవేటు వ్యక్తులకు అప్పగించడానికి తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని, భవిష్యత్తులో ఈ విధానాలకు వ్యతిరేకంగా ఏలాంటి పోరాటాల కైనా సిద్ధమని తెలిపారు. స్త్రీ శక్తి పథకం విజయవంతం చేయడానికి ఆర్టీసీనే సొంతంగా మూడు వేల కొత్త బస్సులు కొనుగోలు చేయాలని, పదివేల మంది సిబ్బందిని నియమించాలని డిమాండ్ చేశారు. ఇది ప్రభుత్వ వ్యతిరేక ఉద్యమం కాదని ఆర్టీసీ పరిరక్షణ ఉద్యమమని, భవిష్యత్తులో ఉద్యోగ అవకాశాలు కల్పనకు, ప్రజలకు మెరుగైన సేవలందించడానికి ఆర్టిసిని కాపాడుకోవడానికి చేస్తున్న ఉద్యమమని తెలిపారు. ప్రభుత్వం పునరాలోచించి విద్యుత్ బస్సులను ఆర్టీసీని కొనేలా, వాటిని ఆర్టిసి సిబ్బందితో నిర్వహించేలాగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. డిపోలకు డిపోలు ప్రైవేటు వారికి అప్పగిస్తే సిబ్బంది అంతా ఎక్కడికి వెళ్లాలని నిలదీశారు. భవిష్యత్తులో సిబ్బంది చాలా సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తుందని, మన జిల్లాలో మొదటగా కర్నూల్ టూ డిపోను ప్రైవేట్ వారికి అప్పగించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని అన్నారు. సిబ్బంది అందరూ ఆర్టీసీ ప్రైవేటీకరణ కు వ్యతిరేకంగా జరిగే ఉద్యమాలకు సిద్ధం కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లాలోని అన్ని డిపోల నాయకులు జి. మహేశ్వరరావు, ఆర్. వి. ఎం.రావు , ఉలిగప్ప , ఈవీఎం రాజు, బసవరాజు, జిల్లా కోశాధికారి కే సి వై కృష్ణ, కర్నూల్ టు డిపో వైస్ ప్రెసిడెంట్ రబ్బానీ , గౌస్, శివకేసన్న,రామృకృష్ణ ,వీరేశ్ , 90 మందికి పైగా సిబ్బంది పాల్గొన్నారు.




## అభిషేకా.. సంజూనా?

### సంజూ శాంసన్‌ను ఆడించాలని పెరుగుతున్న డిమాండ్




డిఫెండింగ్ చాంప్ భారత్.. టీ20 వరల్డ్‌కప్ సూపర్-8కు సులువుగానే చేరుకొంది. ఇకపై మాత్రం పోటీ మరింత తీవ్రంగా ఉండే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో ఓపెనర్ అభిషేక్ శర్మ హ్యాట్రిక్ డక్‌లు జట్టును తీవ్ర ఆందోళనకు గురి చేస్తున్నాయి. టోర్నీకి ముందు పరుగుల వరద పారించిన అభిషేక్.. వరల్డ్‌కప‌లో ఖాతా కూడా తెరవకపోవడం మేనేజ్‌మెంట్‌ను కలవరపెడుతోంది. అమెరికాతో జరిగిన మ్యాచ్‌లో గోల్డెన్ డక్‌గా వెనుదిరిగిన శర్మ.. పాకిస్థాన్, నెదర్లాండ్స్‌పై కూడా సున్నాకే పెవిలియన్ చేరాడు. స్పిన్నర్లను ఎదుర్కోవడంలో అతడి బలహీనతను పసిగట్టిన ప్రత్యర్థులు.. తొలి ఓవర్‌లోనే శర్మను బోల్తా కొట్టిస్తున్నారు. నెదర్లాండ్స్‌తో మ్యాచ్‌లో స్పిన్నర్ ఆర్యన్ బౌలింగ్‌లో అభిషేక్ బౌల్డ్ అయ్యాడు. బంతిని ఏమాత్రం గమనించక పోవడం, తగిన ఫుట్‌వర్క్ లేకపోవడం వల్లే అతడు వరుసగా విఫలమవుతున్నాడని విశ్లేషకులు చెబుతున్నారు. భారీ అంచనాల ఒత్తిడి కూడా శర్మ ఆటపై తీవ్ర ప్రభావం చూపిస్తోందని అంటున్నారు. ఆరంభంలోనే షాట్ ఆడే బదులు సింగిల్ తీస్తే మేలని గవాస్కర్ సూచించినా.. అతడు మాత్రం పట్టించుకోవడం లేదు. ఈ క్రమంలో కీలక సూపర్-8 మ్యాచ్‌ల్లో అభిషేక్‌ను జట్టులో కొనసాగించడంపై సందేహాలు వ్యక్తమవుతున్నాయి. అతడి స్థానంలో సంజూ శాంసన్‌ను ఓపెనర్‌గా దించాలన్న డిమాండ్ క్రమంగా ఊపందుకొంటోంది. మరోవైపు శాంసన్ కూడా గొప్ప ప్రదర్శనేమీ చేయడం లేదు. అభిషేక్ అనారోగ్యానికి గురికావడంతో.. నమీబియాతో మ్యాచ్‌లో చాన్స్ దక్కించుకొన్న అతడు పెద్దగా ఆకట్టుకోలేక పోయాడు. ఇలా ఓపెనర్లు విఫలమవుతుండడంతో పవర్‌ప్లేలో ఆ ప్రభావం స్పష్టంగా కనిపిస్తోంది. తర్వాతి రౌండ్ మ్యాచ్‌ల్లో ఇదే రిపీటైతే.. తగిన మూల్యం చెల్లించుకోవాల్సి రావచ్చు కూడా..! కానీ, అభిషేక్‌కు మాజీ స్పిన్నర్ అశ్విన్ అండగా నిలిచాడు. ఒంటిచేత్తో మ్యాచ్‌లను గెలిపించే శర్మ లాంటి వాడిపై వేటేయడం వ్యూహాత్మక తప్పిదం అవుతుందని అన్నాడు.

## టీ20 వరల్డ్ కప్.. సూపర్-8లో

# ఎవరు.. ఎవరితో.. పూర్తి షెడ్యూల్

ఐసీసీ పురుషుల టీ20 ప్రపంచకప్ 2026 అసలు సిసలైన, ఉత్కంఠభరితమైన ఘట్టానికి చేరుకుంది. 20 జట్లతో ప్రారంభమైన ఈ మెగా టోర్నమెంట్ ఇప్పుడు సూపర్ 8 దశకు చేరుకుంది. సెమీ ఫైనల్స్‌లో నాలుగు బెర్తుల కోసం ఎనిమిది మేటి జట్లు అమీతుమీ తేల్చుకోనున్నాయి. ఫిబ్రవరి 21 నుంచి మార్చి 1 వరకు భారత్, శ్రీలంక వేదికలుగా ఈ కీలక మ్యాచ్‌లు జరగనున్నాయి. లీగ్ దశలో ప్రతి గ్రూపు నుంచి టాప్-2లో నిలిచిన జట్లు ఈ దశకు అర్హత సాధించాయి.




సూపర్ 8కు చేరిన జట్లలో భారత్, వెస్టిండీస్, జింబాబ్వే, దక్షిణాఫ్రికా, న్యూజిలాండ్, శ్రీలంక, ఇంగ్లండ్, పాకిస్థాన్ ఉన్నాయి. ఈ ఎనిమిది జట్లను నాలుగు చొప్పున రెండు గ్రూపులుగా విభజించారు. గ్రూప్ 1లో భారత్, వెస్టిండీస్, జింబాబ్వే, దక్షిణాఫ్రికా ఉన్నాయి. ఈ గ్రూపులోని మ్యాచ్‌లన్నీ భారత్‌లోని వివిధ నగరాల్లో జరగనున్నాయి. గ్రూప్ 2లో న్యూజిలాండ్, శ్రీలంక, ఇంగ్లండ్, పాకిస్థాన్ జట్లు తలపడనున్నాయి. ఈ మ్యాచ్‌లకు సహ ఆతిథ్య దేశమైన శ్రీలంక వేదికగా నిలవనుంది. డిఫెండింగ్ ఛాంపియన్‌గా భారత్ ఈ దశలోకి అడుగుపెడుతుండగా, వెస్టిండీస్, ఇంగ్లండ్, పాకిస్థాన్, శ్రీలంక జట్లకు కూడా టైటిల్ గెలిచిన అనుభవం ఉంది. దక్షిణాఫ్రికా, న్యూజిలాండ్ జట్లు నిలకడగా రాణిస్తూ ఎప్పటిలాగే బలమైన పోటీదారులుగా ఉన్నాయి. ఈ టోర్నీలో అనూహ్య ప్రదర్శనతో అందరి దృష్టిని ఆకర్షించిన జింబాబ్వే కూడా సూపర్ 8లో అదృష్టాన్ని పరీక్షించుకోనుంది. ప్రతి గ్రూపు నుంచి మొదటి రెండు స్థానాల్లో నిలిచిన జట్లు సెమీ ఫైనల్స్‌కు అర్హత సాధిస్తాయి. ఈ నేపథ్యంలో ప్రతి మ్యాచ్ ప్రతి జట్టుకు కీలకం కానుంది.

**సూపర్ 8 మ్యాచ్‌ల పూర్తి షెడ్యూల్:**

ఫిబ్రవరి 21: న్యూజిలాండ్ × పాకిస్థాన్ - కొలంబో
ఫిబ్రవరి 22: ఇంగ్లండ్ × శ్రీలంక - పల్లెకెలె
ఫిబ్రవరి 22: భారత్ × దక్షిణాఫ్రికా - అహ్మదాబాద్
ఫిబ్రవరి 23: జింబాబ్వే × వెస్టిండీస్ - ముంబై
ఫిబ్రవరి 24: ఇంగ్లండ్ × పాకిస్థాన్ - పల్లెకెలె
ఫిబ్రవరి 25: న్యూజిలాండ్ × శ్రీలంక - కొలంబో
ఫిబ్రవరి 26: వెస్టిండీస్ × దక్షిణాఫ్రికా - అహ్మదాబాద్
ఫిబ్రవరి 26: భారత్ × జింబాబ్వే - చెన్నై
ఫిబ్రవరి 27: ఇంగ్లండ్ × న్యూజిలాండ్ - కొలంబో
ఫిబ్రవరి 28: పాకిస్థాన్ × శ్రీలంక - పల్లెకెలె
మార్చి 1: జింబాబ్వే × దక్షిణాఫ్రికా - ఢిల్లీ
మార్చి 1: భారత్ × వెస్టిండీస్ - కోల్‌కతా

మొత్తం మీద, చారిత్రక ప్రత్యర్థుల మధ్య పోరాటాలు, సెమీస్ బెర్తుల కోసం జరిగే హోరాహోరీతో సూపర్ 8 దశ క్రికెట్ అభిమానులకు అసలైన మజాను పంచనుంది. ఈ దశలో ఎవరు పైచేయి సాధించి నాకౌట్‌కు చేరుకుంటారోనని క్రికెట్ ప్రేమికులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.




## ప్రేమ విషయంలో యువత ఓపికగా ఉండాలంటున్న మృణాల్ ఠాకూర్



'సీతారామం', 'హాయ్ నాన్న' చిత్రాలతో తెలుగు ప్రేక్షకులకు ఎంతగానో దగ్గరైన నటి మృణాల్ ఠాకూర్, ప్రేమ విషయంలో నేటి యువతకు ఓ ముఖ్యమైన సందేశం ఇచ్చారు. ప్రేమను కాపాడుకోవాలంటే ఓపిక చాలా అవసరమని, దానిపై సులభంగా నమ్మకం కోల్పోవద్దని ఆమె సూచించారు. ప్రస్తుతం తన కొత్త చిత్రం 'దో దీవానే షెహర్ మే' ప్రమోషన్లలో భాగంగా ఆమె ఈ వ్యాఖ్యలు చేశారు. ఓ ఇంటర్వ్యూలో మృణాల్ మాట్లాడుతూ.. "ప్రస్తుత డిజిటల్ ప్రపంచంలో ప్రేమలో ఓపిక తగ్గిపోతోంది. అందుకే చాలామంది ఒకరినొకరు తేలిగ్గా వదులుకుంటున్నారు. మా సినిమాలో పాత్రల మాదిరిగా పాతకాలపు మనస్తత్వం ఉంటే బాగుంటుంది. చిన్న గొడవ వస్తే చాలు, వెంటనే ఒకరినొకరు బ్లాక్ చేసేస్తున్నారు. మా దారులు వేరు, మేం ఒకరికొకరం సెట్ కాము అని తేలిగ్గా చెప్పేసి సంబంధాలను వదులుకుంటున్నారు" అని అన్నారు.

"ప్రతి యువతీ యువకుడు ప్రేమను నమ్మాలని కోరుకుంటున్నాను. దయచేసి ప్రేమపై నమ్మకం వదులుకోవద్దు. అది చాలా అందమైన, అద్భుతమైన అనుభూతి. సరైన వ్యక్తి మీ జీవితంలోకి వస్తే, జీవితం సులభంగా మారుతుంది. అందుకే సరైన వ్యక్తి కోసం ఓపికగా ఎదురుచూడండి. అంతేకానీ తొందరపడి ఎలాంటి నిర్ణయాలు తీసుకోవద్దు" అని యువతకు ఆమె సలహా ఇచ్చారు.

ఇక 'దో దీవానే షెహర్ మే' చిత్రంలో మృణాల్‌తో పాటు సిద్ధాంత్ చతుర్వేది, సందీపా ధర్, ఆయేషా రజా కీలక పాత్రల్లో నటిస్తున్నారు. సంజయ్ లీలా భన్సాలీ, జీ స్టూడియోస్ సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ సినిమా ఫిబ్రవరి 20న విడుదల కానుంది.

## మానస వారణాసికి కొత్త ప్రాజెక్టులు క్యూ కడుతున్నట్టు టాక్



వెండితెరపై హీరోయిన్ గా కనిపించాలంటే అందం ఒక్కటే వుంటే సరిపోదు .. అదృష్టం కూడా ఉండాలి. ఎందుకంటే ఎంతటి గ్లామర్ ఉన్నప్పటికీ .. టాలెంట్ ఉన్నప్పటికీ .. స్టార్ డమ్ దక్కడం అంత తేలికగా జరగదు. చాలామంది హీరోయిన్స్ తమ సినిమా హిట్ అయితే చాలు, తమ మార్కెట్ .. పారితోషికం పెరిగిపోతుందని అనుకుంటారు. కానీ సినిమా హిట్ అయినా ఒక్కోసారి ఆ క్రెడిట్ ఎవరి ఎకౌంటులోకో వెళ్లిపోతూ ఉంటుంది. అందుకే అంటారు అదృష్టం కూడా ఉండాలని.


హీరోయిన్స్ ఒకప్పటి మాదిరిగా తెరపై ఎక్కువ కాలం పాటు రాజ్యం చేసే పరిస్థితి లేదు. అందువలన ప్రతి సినిమా వాళ్లకి చాలా విలువైనదిగానే కనిపిస్తూ ఉంటుంది. హిట్ అయిన సినిమాతో మరింత పాప్యులర్ కావాలనే కోరుకుంటూ ఉంటారు. అయితే ఒక్కోసారి మొదటి ప్రయత్నం నిరాశపరిచినా, రెండో ప్రయత్నంతో దశ తిరిగిపోతూ ఉంటుంది. అలాంటి అందాల నాయికల జాబితాలో తాజాగా మానస వారణాసి పేరు కూడా చేరిపోయింది.

మానస వారణాసి తెలంగాణ అమ్మాయి. అనేక అందాల పోటీలలో బహుమతులు గెలుచుకున్న నాజూకు నాయిక. 'కపుల్ ఫ్రెండ్లీ' సినిమా తరువాత అంతా ఈ బ్యూటీని గురించే మాట్లాడుకుంటున్నారు. పొన్నాగి పూలతో పోతబోసినట్టు .. తామర రేకులతో రాశి పోసినట్టుగా కనిపించే ఈ సుందరి పేరు ఇప్పుడు యూత్ జపించే మధురమైన మంత్రమైపోయింది. ప్రస్తుతం టాలీవుడ్ లో గట్టిపోటీలేదు. ఇలాంటి సమయంలో ఎంట్రీ ఇవ్వడం ఈ భామకి కలిసొచ్చే విషయం. యంగ్ హీరోలంతా తమ ప్రాజెక్టుల కోసం ఇప్పుడు ఈ బ్యూటీని రికమెండ్ చేస్తున్నట్టుగా టాక్. సౌందర్యానికి సరైన అర్థంలా కనిపించే మానస వారణాసి, ముున్ముందు మరెన్ని మహిమలు చేస్తుందో చూడాలి.






## చెన్నై నగరాన్ని చాలా మిస్ అవుతున్నాను: ప్రభాస్



పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ తన వ్యక్తిగత జీవితానికి సంబంధించిన ఒక ఆసక్తికర విషయాన్ని పంచుకున్నారు. తాను పుట్టి పెరిగిన చెన్నై నగరంతో తనకున్న అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు. హైదరాబాద్‌కు రాక ముందు తన బాల్యం అక్కడే గడిచిందని, అప్పుడప్పుడు ఆ నగరాన్ని చాలా మిస్ అవుతుంటానని తెలిపారు.

ఇటీవల హిట్టయిన 'కపుల్ ఫ్రెండ్లీ' చిత్ర బృందంతో ప్రభాస్ ముచ్చటించారు. ఈ సినిమాలో సంతోష్ శోభన్, మానస వారణాసి జంటగా నటించారు. సినిమా కథలో ఎక్కువ భాగం చెన్నై నేపథ్యంలో సాగుతుంది. ఈ సందర్భంగా దర్శకుడు అశ్విన్ చంద్రశేఖర్.. "మీరు చెన్నై నుంచి ఇక్కడికి వచ్చారని విన్నాను. చెన్నై గురించి మీకేం గుర్తుంది?" అని ప్రభాస్‌ను అడిగారు.

దీనికి ప్రభాస్ బదులిస్తూ, "నేను పుట్టింది అక్కడే. చెన్నైలోని డాన్ బాస్కో స్కూల్‌లో చదువుకున్నాను. హైదరాబాద్ వచ్చాక తమిళం దాదాపు మర్చిపోయాను. కానీ, రాజు మాస్టర్, ప్రభు మాస్టర్ వంటి వారితో పాటు తెలుగు పరిశ్రమలో పనిచేసే చాలా మంది టెక్నీషియన్లు తమిళులే. వారితో మాట్లాడుతూ ఉండటం వల్ల నా తమిళం మళ్లీ మెరుగైంది. ఇప్పటికీ చెన్నై వెళ్లినప్పుడు డాన్ బాస్కో స్కూల్ ను చూస్తుంటాను. ఆ నగరం నాకెంతో ఇష్టం" అని తన జ్ఞాపకాలను పంచుకున్నారు.

'కపుల్ ఫ్రెండ్లీ' సినిమాను యూవీ కాన్సెప్ట్స్ పతాకంపై అజయ్ కుమార్ రాజు నిర్మించగా, యూవీ క్రియేషన్స్ సమర్పిస్తోంది. లివ్-ఇన్ రిలేషన్‌షిప్‌లో ఉన్న ఒక జంట కథ ఆధారంగా ఈ చిత్రం తెరకెక్కింది.

Edited, Printed, Published & Owned by **LEKKALA SREENU** and Published from D.NO: 4-14/5-201, Revenue Ward NO. 57, Aganampudi, Near Toll Gate, Duvvada, Talarivanipalem,VISAKHAPATNAM, AP-530049 and Printed at **Guddapuvalasa Ramani**, D.No. 18-135/1/1, Opp. Apollo Hospital, Pedagadhili, VISAKHAPATNAM, A.P.-530040. E-mail: Pathakamnews.ap@gmail.com, **Mobile No: 7097975757, Reg No. APTEL/25/A2082**